గెలుపు పొందే వరకూ..

ఒకటే లక్ష్యం.. ప్రభుత్వ ఉద్యోగం..!



అనంతపురం రెండో రోడ్డు పార్కులో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు

- ప్రభుత్వ ఉద్యోగం కోసం పోరాటం
- ఉద్యోగ పరీక్షల కోసం సన్నద్ధం
- ఉద్యోగార్థులతో పార్కులు కిటకిట

అనంతపురం విద్య, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): అక్షర యజ్ఞంలో ఉన్నతమైన మజిలీ కోసం అనేకమంది నిరుద్యోగులు పరితపిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా రేయింబవళ్లు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. ఒక్కసారి ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తే జీవితం సాఫీగా సాగుతుందని అహరహం శ్రమిస్తున్నారు. ఈక్రమంలోనే ప్రభుత్వాలు కూడా టీచర్, కానిస్టేబుల్, బ్యాంకింగ్, రైల్వే తదితర శాఖల్లో ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్లు జారీ చేసింది. దీంతో ఉద్యోగార్థులు కొందరు కోచింగ్ సెంటర్లలో, మరికొందరు నగరంలోని పార్కుల్లో పుస్తకాలకే అంకితమైపోయారు. జూన్ 1న కానిస్టేబుల్ ఉద్యోగాలకు రాత పరీక్షలు నిర్వహించనున్నారు. మెగా డీఎస్సీకి సంబంధించిన పరీక్షలు జూన్ 6 నుంచి జులై 6వ తేదీ వరకూ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో మిగతా ప్రపంచంతో సంబంధం లేకుండా తమదైన లోకంలో ఉద్యోగార్థులు శ్రమిస్తున్నారు. గెలుపు పొందే వరకు అలుపు లేదు మనకు అంటూ అక్షర క్రతువును కొనసాగిస్తున్నారు.

బరితెగింపు..!



బెలుకుమట్టి లోడుతో సిద్ధంగా ఉన్న ట్రాక్టర్లు

పుట్లూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): వరుసగా ట్రాక్టర్లు ఉండడంతో పోటీలు పెట్టారనుకుంటే తప్పులో కాలేసినట్లే. వైసీపీ మట్టి మాఫియా బరితెగింపునకు నిదర్శనం ఈ ఫొటో. పార్టీ అధికారం కోల్పోయినా.. వారి మట్టి దందా ఆగట్లేదు. బెలుకు మట్టిని తరలించేందుకు లోడు చేసి, సిద్ధంగా ఉన్న ట్రాక్టర్లు. వీటిని కొందరు వైసీపీ నాయకులే ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పెట్టారు. ఈ ఫొటోలు వైరల్ అయ్యాయి. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న బెలుకు మట్టిని అక్రమంగా కొందరు వైసీపీ నాయకులు తరలిస్తున్నారు. అనుమతులున్నాయంటూ వైసీపీ నాయకులు బుకాయిస్తున్నట్లు తెలుస్తోంది. ట్రిప్పు ట్రాక్టర్ రూ.300 చొప్పున ఇతర గ్రామాల రైతులకు విక్రయిస్తున్నట్లు సమాచారం. రూ.300చొప్పున 15ట్రాక్టర్లు రోజూ 200ట్రిప్పులకుపైనే అక్రమ రవాణా చేస్తున్నారన్న విమర్శలున్నాయి. పుట్లూరు, చింతకుంట, కందికాపుల, నాయకునిపల్లి, బాలాపురం తదితర గ్రామాలకు బెలుకును రవాణా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇతర గ్రామాల నుంచి బెలుకు మట్టికి డిమాండ్ ఉండడంతో రైతులు కూడా మొగ్గు చూపుతున్నారు. వీటిపై కొందరు టీడీపీ నాయకులు.. రెవెన్యూ అధికారులకు ఫోన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి.

కార్పొరేషన్‌లో 17 మందిపై చర్యలు

ఏసీబీ నివేదిక ఆధారంగా ఉత్తర్వులు

అనంతపురం క్రైం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో పనిచేస్తున్న 17 మంది అధికారులు, సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఏసీబీ నివేదిక ఆధారంగా ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2021 డిసెంబరు 14, 15తేదీలలో అప్పటి ఏసీబీ డీఎస్పీ కులశేఖర్ ఆధ్వర్యంలో అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. టౌన్‌ప్లానింగ్ విభాగంలో అక్రమ కట్టడాలకు అనుమతులు, రెవెన్యూ విభాగంలో పన్ను వసూళ్ల రికార్డులను పరిశీలించారు. నగరంలో ఐదు వివాదాస్పద భవనాలను పరిశీలించారు. భారీగా అక్రమాలు జరిగినట్లు గుర్తించి, ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. అప్పటి కమిషనర్ పీవీవీఎస్ మూర్తి, ఏసీపీలు ఇషాక్, సుబ్బారావు, రామలింగేశ్వర్ రెడ్డి, శాస్త్రి షబ్నస్, టీపీఓ వినయ్‌ప్రసాద్, టీపీఎస్‌లు అబ్దుల్ సత్తార్, అలివేలమ్మ, మహబూబ్‌జాన్, వెంకటేష్, టీపీబీఓలు రామమోహన్, మురళీకృష్ణ, సూర్యనారాయణ, సర్వేయర్ కరుణాకర్, జూనియర్ అసిస్టెంట్‌లు మహేష్, రమ్యసాయి, యుగంధర్ రెడ్డిని బాధ్యులుగా నిర్ధారించారు. వీరిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది.

వీఆర్‌కు సీసీఎస్ సీఐ ఇస్మాయిల్

అనంతపురం సీసీఎస్ సీఐ ఇస్మాయిల్‌ను వీఆర్‌కు పంపారు. ఏడాదిన్నర నుంచి ఈయన సీసీఎస్‌లో ఉంటున్నారు. ఉత్తర్వులు అందగానే రిలీవ్ అయ్యారు. పలు ఆరోపణల నేపథ్యంలోనే వీఆర్‌కు పంపినట్లు సమాచారం. ఇస్మాయిల్ స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

పల్లెపల్లెకు అంబేడ్కర్ దార్శనికత

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ్



మాట్లాడుతున్న మాధవ్

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దార్శనికతను పల్లెపల్లెకు తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. అంబేడ్కర్ జయంతి వేడుకలను పరస్కరించుకుని శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రోగ్రాం ఇన్‌చార్జి, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి శాంతకుమార్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి మేధావుల సదస్సు నిర్వహించారు. ఓ ప్రైవేటు హోటల్‌లో నిర్వహించిన సదస్సులో తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. మాధవ్ మాట్లాడుతూ.. బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ ప్రోగ్రాం రాయలసీమ ఇన్‌చార్జి సందిరెడ్డి శ్రీనివాసులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్, కడప పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి దుద్దకుంట వెంకటేశ్వరరెడ్డి, రాప్తాడు అసెంబ్లీ కన్వీనర్ రావి చైతన్య కిషోర్, నాయకులు రత్నమయ్య, అంకాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలు నివారించండి: కలెక్టరు



మాట్లాడుతున్న కలెక్టరు వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): బ్లాక్‌స్పాట్‌లలో తగిన చర్యలు తీసుకుని రోడ్డు ప్రమాదాలు నివారించాలని కలెక్టరు వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటి నివారణకు కారణాలు తెలుసుకొని, అక్కడ అవసరం మేర కు ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రధానంగా బ్లాక్‌స్పాట్‌లలో సూచికలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అన్నిబస్టాండ్‌లలో ప్రయాణికుల కోసం చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ ఆర్ఎంను ఆదేశించారు. వేసవికాలంలో పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవడంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని డీఈఓకు సూచించారు. జిల్లా ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ బ్లాక్‌స్పాట్‌లలో ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అధిక లోడ్‌తో వెళ్లేవాహనాలు, మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ రాజగోపాల్, డీటీసీ వీర్రాజు, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు, డీఎస్పీలు, పలుశాఖల అధికారులు, స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

వరి రైతుకు ఊరట

- కణేకల్లులో కొనుగోలు కేంద్రం ఏర్పాటు
- వాతావరణ మార్పులతో తీవ్ర ఆందోళన
- పంట కోతకు జంకుతున్న అన్నదాతలు

ఉద్దేహాళ్ గ్రామానికి చెందిన జనార్దనపల్లి రామాంజనేయులు తన పొలంతో పాటు మరికొంత భూమి కౌలుకు తీసుకుని వరి సాగు చేశాడు. వరికోతలు చేయించి, ధాన్యం ఆరబెట్టాడు. విక్రయం కోసం తొలుత ఓ దళారిని సంప్రదించాడు. క్వింటా రూ. 2040 నుంచి రూ. 2050 వరకు అడిగారు. తర్వాత వాతావరణంలో మార్పులు రావడంతో ఆ దళారీ ఆ రైతు వద్దకు వచ్చి ధర తగ్గిపోయిందని చెప్పాడు. దీంతో రైతు బోరుమన్నాడు. వర్షం వచ్చే సూచనలు ఉండటంతో ఆరబెట్టి ధాన్యం ఏమైపోతుందో అని తీవ్రంగా ఆందోళన చెందాడు. ఇలాంటి స్థితిలో ప్రభుత్వం వరి కొనుగోలు కేంద్రాన్ని కణేకల్లులో శుక్రవారం ఏర్పాటు చేసింది. దీంతో రైతు తాను పండించిన ధాన్యాన్ని అక్కడకి తరలించాలని అనుకుంటున్నాడు. ఇది ఒక జనార్దనపల్లి రామాంజనేయులు పరిస్థితే కాదు. నియోజకవర్గంలో వరి సాగు చేసిన ప్రతీ రైతు దీనగాథ.



ధాన్యం ఆరబెడుతున్న రైతులు

బొమ్మనహాళ్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): వాతావరణ పరిస్థితులు క్షణానికోవిధంగా మారడంతో మండల రైతులు వరి కోతలు కోయాలా వద్దా అన్న సందిగ్ధంలో పడిపోయారు. గత వారం అకాలవర్షం కారణంగా వడగండ్లు పడి గోనేహాళ్, శ్రీధరఘట్ట, లింగదహాళ్, బండూరు గ్రామాల రైతులు వరి, పత్తి తదితర పంటలను పూర్తిగా నష్టపోయారు. వాస్తవానికి మండలంలో ఇప్పటికే 50 శాతం వరి కోతలు పూర్తికావాలి. వాతావరణం కారణంగా 20 శాతం కూడా పూర్తి కాలేదు. పంటలు పూర్తి చేసుకుని ఆనందంగా కోతలు ప్రారంభిద్దామని అనుకున్న రైతులకు వరుణుడు అడ్డుపడుతున్నాడు. దీంతో రైతులు వెనకడుగు వేస్తున్నారు.

తేమ శాతంతో సతమతం

తేమ శాతం 17 కంటే తక్కువ చూపిస్తే తప్ప ప్రభుత్వ కేంద్రాలలో ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదు. చేసేది లేక కోసిన ధాన్యాన్ని ఆరబెట్టుకుని సాయంత్రం వాటిపై టార్పాలిన్లు కప్పుకుని బిక్కుబిక్కుమంటున్నారు. వర్షంతోపాటు ఈదురు గాలులు వీస్తుండటంతో కొన్ని చోట్ల పైర్లు నేలనంటాయి. వీటిని కోయాలంటే అనుకున్న దానికంటే ఎక్కువ సమయం పడుతుంది. ఫలితంగా రైతులు అదనంగా డబ్బులు చెల్లించాల్సిందే. సాయంత్రం అయితేనే వాతావరణం మార్పుతో రైతులు ఆరబెట్టుకున్న ధాన్యం తడిసి పోకుండా కాపాడుకునేందుకు కళ్లాలవైపు టార్పాలిన్లు తీసుకుని పరుగులు పెడుతున్నారు.

ఇబ్బంది లేకుండా ధాన్యం కొనాలి



రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో ఇబ్బంది లేకుండా కొనాలి. బయట దళారీలు, వ్యాపారులు సిండికేటు అయ్యి ధాన్యాన్ని ఇష్టానుసారంగా అడుగుతున్నారు. అధికారులు శ్రద్ధ చూపి రైతులు ఇబ్బందులు పడకుండా ధాన్యం కొనుగోలు చేయాలి. గత ఖరీఫ్‌లో క్రాప్ బుకింగ్ కాలేదని నా ధాన్యం కొనుగోలు చేయలేదు. ఈ సారి రబీలో క్రాప్ బుకింగ్, ఈకేవైసీ చేయించా.

-జనార్దనపల్లి రామాంజనేయులు, ఉద్దేహాళ్

అడిగేవారు లేరు



ధాన్యాన్ని అడిగేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. వాతావరణం మార్పు వల్ల భయం కల్గుతోంది. పగలు ఎండకు బాగా ఆరబెడుతున్నాం. సాయంత్రం వర్షం వస్తుందని ఆందోళనతో కుప్పలు వేసి టార్పాలిన్లు కప్పేస్తున్నాం. వ్యాపారులు, దళారులు కలిసి ధాన్యాన్ని వారు చెప్పిన ధరకే విక్రయించాలని అడుగుతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రం శుక్రవారం ఏర్పాటు చేయడం వల్ల కొద్ది వరకు ఊపిరి ఆడుతుంది.

-రవి, రైతు, శ్రీధరఘట్ట

ప్రతి రైతు ధాన్యం కొనుగోలు చేస్తాం



2024-25 రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. క్రాప్ బుకింగ్ చేసిన ప్రతి రైతు ధాన్యం కొనుగోలు చేస్తాం. మండల వ్యాప్తంగా ఈ సారి రబీలో 1132 ఎకరాల్లో క్రాప్ బుకింగ్ అయ్యింది. క్వింటా రూ.2320, దొడ్డ రకం రూ 2300తో కొనుగోలుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

- సాయికుమార్ వ్యవసాయాధికారి, బొమ్మనహాళ్

హంద్రీనీవా నుంచి సాగు నీటిని కేటాయించాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్



సమావేశంలో మాట్లాడుతున్న జగదీష్

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ ద్వారా నియోజకవర్గానికి సాగు నీటిని కేటాయించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జగదీష్ కోరారు. సీపీఐ స్థానిక కార్యాలయంలో శుక్రవారం మండల సమితి ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సీపీఐ, వైసీపీ, టీడీపీ, ఎమ్మార్పీఎస్, పలుగ్రామాల రైతులు పాల్గొన్నారు. జగదీష్ మాట్లాడుతూ.. హంద్రీనీవా కాలువకు మొదటి దశలో 1.98వేల ఎకరాలకు గాను కర్నూలు జి ల్లాలో 80వేల ఎకరాలకు, అనంతపురం జిల్లాలో 1.18ఎకరాల ఆయకట్టుకు నీటిని ప్రతిపాదించారన్నారు. హంద్రీనీవా కాలువ గుంతకల్లు మీదుగా వెళ్తున్నా నియోజకవర్గానికి నీటిని కేటాయించలేదన్నారు. వ్యవసాయ భూములకు హంద్రీనీవా నుంచి పిల్ల కాలువలు ద్వారా నీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెండ్ గోవిందు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి మహేష్, మండల కార్యదర్శి రాము, సహాయ కార్యదర్శి రామాంజినేయులయాదవ్, పట్టణ కార్యదర్శి గోపినాథ్, టీడీపీ నాయకులు మందాలప్ప, కందుల ప్రసాద్‌రెడ్డి, వైసీపీ పట్టణ, మండల అధ్యక్షులు ఖలీల్, రాము ఎమ్మార్పీఎస్ నాయకులు ఆనంద్, నరసింహులు, రైతులు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



కణేకల్లులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కాలవ

కణేకల్లు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆంధ్రబ్యాంక్ సొసైటీ వద్ద వరి కొనుగోలు కేంద్రాన్ని విప్ కాలవ శ్రీనివాసులు శుక్రవారం ప్రారంభించారు. రైతుల నుంచి ప్రభుత్వం క్వింటా రూ. 2300 మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందన్నారు. ధాన్యాన్ని కొనుగోలు చేసిన 48 గంటల్లోనే వారి అకౌంట్‌లోకి డబ్బు జమ అవుతుందని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ జేడీఏ ఉమామహేశ్వరమ్మ, ఆర్డీఓ వసంతబాబు మాట్లాడుతూ ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ప్రత్యేక చొరవతో 48 గంటల్లోనే వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు అనుమతులు వచ్చాయన్నారు. సివిల్ సప్లై డీఎం మాట్లాడుతూ రబీ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 29,900 మెట్రిక్ టన్నుల వరి కొనుగోలుకు సిద్ధమైనట్లు తెలిపారు. ఇందులో 7100 మెట్రిక్ టన్నులు కణేకల్లు మండలంలోనూ, మరో ఏడు వేల మెట్రిక్ టన్నులు బొమ్మనహాళ్ మండలంలోనూ కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ లాలెప్ప, ఆనంద్‌రాజ్, చంద్రశేఖర్‌గుప్తా, బీటీ రమేష్, ఎంపీటీసీ నరేంద్ర, కురుబ నాగరాజు, అనిల్, మాబుసాబ్, చాంద్‌బాషా, ఎస్‌కే మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు



క్లాక్‌టవర్ కూడలిలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ఉగ్రమూకలను అంతమొందించాలి

గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్

మృతుల ఆత్మశాంతికోసం ముస్లింల ప్రార్థనలు

అనంతపురం క్రైం/కల్చరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పహల్గాంలో పర్యాటకులను హతమార్చిన ఉగ్రమూకలను వారి మూలాలతో సహా అంతమొందించి, భారతదేశ సత్తా చాటి చెప్పాలని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్ డిమాండ్ చేశారు. ఉగ్రదాడిని నిరసిస్తూ, మృతులకు ఆత్మశాంతి చేకూరాలని కోరుకుంటూ సాయినగర్ మస్జిద్‌లో శుక్రవారం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం నగర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. 'మేరా భారత్ మహాన్' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గౌస్‌మొద్దీన్ మాట్లాడుతూ... దేశంలో అన్ని మతాలవారు కలిసికట్టుగా ఉండటాన్ని జీర్ణించుకోలేక ఉగ్రవాద సంస్థలు దాడులకు పాల్పడుతున్నాయని అన్నారు. ఇలాంటి దాడులను తిప్పికొట్టి ఐక్యత చాటాలని పిలుపునిచ్చారు. మరోసారి ఇలాంటి ఆలోచన చేయాలంటే వెన్నులో వణుకు పుట్టేలా ఉగ్రవాదులకు బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో సాయినగర్ మస్జిద్ ముతవల్లి కరీముల్లా, అఫీసాబ్ నూరుల్లా, గౌస్‌పీర్, సాదిక్ వలి, మున్వర్, తాజుద్దీన్, తూముచెర్ల బాబావలి, జావేద్ పాల్గొన్నారు.

కోర్టు విధుల బహిష్కరణ

పహల్గాంలో ఉగ్రదాడి అమానుషమని బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గురుప్రసాద్ అన్నారు. దాడికి నిరసనగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండో రోజు శుక్రవారం న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. అనంతరం జిల్లా కోర్టు నుంచి క్లాక్ టవర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గురుప్రసాద్, ఉపాధ్యక్షుడు ధరంసింగ్ నాయక్ మాట్లాడారు. ఉగ్రదాడికి పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మరోసారి ఇలాంటి దాడులు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు వెంకటరాముడు, రాజశేఖర్ గౌడ్, చంద్రశేఖర్, బాను, వహీదా బేగం, జయరాం, వరప్రసాద్, సాకే నరేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.



ఈ చిత్రం అనంతపురం రూరల్ మండలం పాపంపేట పంచాయతీ విద్యారణ్య నగర్‌లోనిది. ఇది విద్యుత్ డి-5సెక్షన్ పరిధిలోకి వస్తుంది. ఇక్కడ విద్యుత్తు స్తంభం ఒక వైపు వంగిపోవడంతో విద్యుత్తు తీగలు చేతికి అందేంత ఎత్తులో వేలాడుతున్నాయి. దీంతో స్థానికులు నిత్యం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు. సమస్యను పలుమార్లు సంబంధిత అధికారులకు చెప్పిన ప్రయోజనం లేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు.



ఇక్కడ కనిపిస్తున్న చిత్రాలు రూరల్ మండలం పాములరాయి గ్రామ సమీపంలోని పంట పొలాల్లోనిది. ఇక్కడ రెండు విద్యుత్తు స్తంభాలు ఒక వైపునకు ఒరిగిపోయాయి. దీంతో ఎప్పుడు కింద పడతాయో తెలియనీ పరిస్థితి నెలకొంది. ఒక విద్యుత్తు తీగ ఆధారంతో ఆ రెండు స్తంభాలు పడకుండా ఉన్నాయి. ఓమోస్తరు గాలి వీచినా పడిపోయే పరిస్థితి నెలకొంది. స్థానిక రైతులు సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా ప్రయోజనం లేకుండా పోయింది. ఇలాంటివి జిల్లా వ్యాప్తంగా చాలానే ఉన్నాయి. అయినా వాటిని సరిచేయడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు.

వేలాడుతున్న ప్రమాదం..!

చేతికందే ఎత్తులో విద్యుత్తు తీగలు

నెలకొరిగే స్థితిలో స్తంభాలు

సరిచేయడంలో అధికారుల అలసత్వం

అనంతపురంరూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): విద్యుత్తు శాఖ అధికారుల తీరు పలు విమర్శలకు తావిస్తోంది. నిత్యం విద్యుత్తు ప్రమాదాలు జరుగుతున్న అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది మేల్కొనడం లేదు. ఎప్పటికప్పుడు సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. ప్రజలు, రైతులు స్థానికంగా నెలకొన్న సమస్యలను విద్యుత్తు శాఖ వర్గాల దృష్టికి తీసుకెళ్లిన పెడచెవిన పెడుతున్నారు. దీనిపై తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

చేతికందేంత ఎత్తులో తీగలు

అనంతపురం జిల్లా కేంద్రంతోపాటు..చుట్టుపక్కల ప్రాంతాల్లో నెలకొరిగే స్థితిలో విద్యుత్ స్తంభాలున్నాయి. చేతికందేంతా ఎత్తులో తీగలు వేలాడుతున్నాయి. వాటిని సరిచేయడంలో సంబంధిత యంత్రాంగం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి క్షేత్రస్థాయిలోని లైన్‌మెన్ తమ పరిధిలోని ప్రాంతాల్లో పర్యటిస్తూ సమస్యలను గుర్తించాల్సి ఉంది. తద్వారా తన పైస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. అనంతరం ఆ అధికారులు సమస్య పరిష్కారానికి అంచనాలను ఉన్నతాధికారులకు పంపి పరిష్కరించాల్సి ఉంది. అయితే ఈ ప్రక్రియ ఎక్కడ సాగడం లేదు. కేవలం రెవెన్యూ కలెక్షన్స్, చిన్న సమస్యల పరిష్కారంతోనే లైన్‌మెన్లు, ఏఈఈలు సరిపెడుతున్నారు. సమస్యలను స్వయంగా వినియోగదారులు, రైతులు శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన స్పందించని పరిస్థితులు క్షేత్రస్థాయిలో నెలకొన్నాయి.

మేల్కోకపోతే.. గాల్లోకి ప్రాణాలు..

నిత్యం విద్యుత్ ప్రమాదాలతో రైతులు, ప్రజలు మరణించడం జరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితిల్లో క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కారానికి చొరవ చూపాల్సిన బాధ్యత శాఖ వర్గాలపై ఉంది. ఇటీవల ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. ఈక్రమంలో ప్రమాద స్థితిలో ఉన్న స్తంభాలు, తీగలు తెగిపోతున్నాయి. దీంతో అమాయక ప్రజలు, రైతులు ప్రాణాలు కోల్పోతున్నారు. దీనికితోడు రానుంది వర్షాకాలం. ఈలోపు ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తే.. ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు వీలుంటుంది.

సమస్యలను గుర్తించమని చెప్పాం



క్షేత్రస్థాయిలో విద్యుత్ పరమైన సమస్యలుంటే గుర్తించమని క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందికి ఆదేశాలు ఇచ్చాం. ఆమేరకు ఎక్కడైతే సమస్యలున్నాయో ఆప్రాంతాల్లో వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. అనంతపురం నగరంతోపాటు, డివిజన్ పరిధిలోని మండలాల్లో మా దృష్టికి వచ్చిన వాటిని ఇటీవల పరిష్కరించాం. ఎక్కడైన సమస్యలున్నా ఎస్టిమేషన్లు వేయడం, లేదంటే క్షేత్రస్థాయిలో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం.

-జేవీ రమేష్, ఈఈ, అనంతపురం డివిజన్



ఈ ఫొటోలో ఉన్న విద్యుత్ స్తంభం ఆలమూరు నుంచి ఎంబీ పల్లికి వెళ్లే 11కేవీ లైన్‌వి. పొలాలలో ఇలాంటివి అనేకం ఉన్నాయి. ఓ వైపు ఒంగిపోయి, శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. కేవలం విద్యుత్ లైన్ సాయంతో ఇవి నిలబడ్డాయి. ఈదురుగాలు వీస్తే కూలిపోయే ప్రమాదం ఉంది. స్తంభాలు మార్చాలని ఓ రైతు కోరడంతో విద్యుత్ శాఖ ఏఈఈ మూడు స్తంభాలను ఎత్తించినట్లు సమాచారం. అయితే స్థానిక లైన్‌మన్ వాటిని ఇతరులకు ఇచ్చారని, ఇక్కడ ఏర్పాటు చేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని అంటున్నారు.

గాలివాన వస్తే చీకటే..!

కూలిపోతున్న విద్యుత్ స్తంభాలు

బ్యాక్‌ఫీడ్ లేక తీవ్ర ఇబ్బందులు



విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్న అధికారులు

విడపనకల్లు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): గాలివాన వచ్చిందంటే మండల ప్రజలు గంటలు, రోజుల తరబడి చీకట్లో మగ్గాల్సి వస్తోంది. విద్యుత్ సరఫరా నిలిచిపోయి.. కార్యాకలాపాలు స్తంభిస్తున్నాయి. కొన్నేళ్లుగా ఈ సమస్య కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. బ్యాక్ ఫీడింగ్ కోసం లైన్ మంజూరైంది. ఆరు నెలల క్రితం రూ.కోటి పైగా విలువైన మెటీరియల్‌ను అధికారులు డ్రా చేశారు. కానీ పనులను ప్రారంభించడం లేదు. గుంతకల్లు నుంచి విడపనకల్లుకు విద్యుత్ సరఫరా చేసేందుకు 50 ఏళ్ల క్రితం నాటిన స్తంభాలే నేటికీ ఆధారం. ఇవి ఎక్కడ పడితే అక్కడ దెబ్బతిన్నాయి. గాలివాన వచ్చిందంటే కూలిపోతున్నాయి. ఏ ప్రాంతంలో దెబ్బతిన్నాయో గుర్తించేందుకు సిబ్బంది వాగులు, వంకలు, అడవుల్లో ప్రయాణిస్తూ.. 35 కి.మీ. వెతకాల్సి వస్తోంది. ఆ తరువాత మరమ్మతులకు మరింత సమయం పడుతోంది.

లైన్ మంజూరు అయినా..

చాబాల సబ్ స్టేషన్ నుంచి ధర్మపురి, జనార్దనపల్లి మీదుగా విడపనకల్లు మండలంలోని మాళాపురం సబ్ స్టేషన్‌కు 33/11 కేవీ లైన్ మంజూరు అయింది. దీని ఏర్పాటు కోసం 12 కి.మీ. దూరానికి రూ.కోటికి పైగా విలువైన విద్యుత్ సామగ్రిని విద్యుత్ శాఖ అధికారులు డ్రా చేశారు. కానీ ఆరు నెలలు గడిచినా పనులను ప్రారంభించలేదు. రెండుసార్లు టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రాలేదని ట్రాన్స్‌కో ఈఈ రాజశేఖర్ తెలిపారు. మూడోసారి గుత్తికి చెందిన కాంట్రాక్టర్ ముందుకొచ్చారని, టెండరు ప్రక్రియ పూర్తి చేశామని తెలిపారు. కొంత మెటీరియల్ డ్రా చేశామని, మరికొంత రావాల్సి ఉందని అన్నారు. ఆ మెటీరియల్ రాగానే పనులు ప్రారంభిస్తామని అన్నారు.

గాలివాన వస్తే..

ఈ నెల 18న మండల వ్యాప్తంగా గాలివాన బీభత్సం సృష్టించింది. దీంతో గుంతకల్లు నుంచి విడపనకల్లు వచ్చే హెవీ విద్యుత్ లైన్‌లో (33/11 కేవీ) ఐదు స్తంభాలు నేలకు ఒరిగాయి. వీటిని గుర్తించేలోగా శనివారం మధ్యాహ్నం అయింది. మరమ్మతులు చేసి.. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు రాత్రి 11 గంట లు అయింది. అప్పటి నుంచి ఆదివారం మధ్యా హ్నం వరకూ అంతరాయాలతో సరఫరా చేశా రు. తిరిగి ఆదివారం సా యంత్రం గాలివాన రావడం తో అంచనహాలు వద్ద మూ డు స్తంభాలు విరిగిపోయాయి. వాటిని గుర్తించేందులోగా సోమవారం మధ్యాహ్నం అయ్యింది. ఇలా.. శుక్రవారం సాయంత్రం మొదలైన విద్యుత్ సరఫరా అంతరాయం.. సోమవారం రాత్రి వరకూ కొనసాగింది.

అన్నీ ఇబ్బందులే..

విద్యుత్ సరఫరా లేనికారణంగా సెల్ ఫోన్‌లు స్విచ్ ఆఫ్ అయ్యాయి. ప్రైవేటు, ప్రభుత్వ కార్యాలయాల్లో కంప్యూటర్లు బంద్ అయ్యాయి. మిక్సీలు, గ్రైండర్లు పనిచేయక ఇళ్లలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. హోటళ్లను మూసేశారు. కొన్నేళ్లుగా ఈ సమస్య కొనసాగుతోంది. గుంతకల్లు లైన్‌లో అంతరాయం ఏర్పడితే చుట్టు పక్కల ఉన్న సబ్‌స్టేషన్ల నుంచి ప్రత్యామ్నాయంగా విద్యుత్ సరఫరా చేసేలా ఏర్పాట్లు ఉండాలి. కానీ అధికారులు పట్టించుకోలేదు. విడపనకల్లు మండలానికి పాల్తూరు సబ్ స్టేషన్, వజ్రకరూరు మండలంలోని చాబాల సబ్‌స్టేషన్, ఉరవకొండ సబ్ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ ఇచ్చే ఏర్పాట్లు చేసుకునే వెసులు బాటు ఉంది. విడపనకల్లు సబ్ స్టేషన్‌కు తప్ప మిగిలిన మండలాల సబ్‌స్టేషన్‌లకు బ్యాక్ ఫీడ్ విద్యుత్ సరఫరా ఏర్పాట్లు ఉన్నాయి.

కల్యాణ వైభోగం



స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఆదిమూర్తి నగర్‌లోని షిర్డీ సాయిబాబా ఆలయంలో శుక్రవారం శ్రీనివాస కల్యాణం కన్నులపండువగా సాగింది. శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. మహా మంగళహారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. వేడుకల్లో ఆలయ కార్యవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

భూమి సారం తెలుసుకుందాం..!

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఏ పంట పెట్టాలన్నా తొలుత భూసారం తెలుసుకోవాలి. భూసారం మేరకు పంటలు వేసి, ఎరువులు, మందులు వాడినపుడే మేలైన దిగుబడులు సాధించవచ్చని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో భూసార పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది జిల్లాకు 25,107 భూసార పరీక్షలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యాన్ని విధించింది. ఈ మేరకు జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి. మే 25వతేదీదాకా క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు, సిబ్బంది మట్టి నమూనాలను సేకరించి, భూసార పరీక్షా కేంద్రానికి పంపాలి. భూసార పరీక్షాకేంద్రంలో ఎప్పటికప్పుడు భూసార పరీక్షలు నిర్వహించి, ఖరీఫ్‌లోగా సాయిల్ హెల్త్ యాప్‌లో ఫలితాలను అప్‌లోడ్ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ మేరకు మండలాల వారీగా ఎన్ని మట్టి నమూనాలు పంపాలన్న వివరాలను ఆయా ఏఓలకు పంపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు... రైతు సేవాకేంద్రంలో సాయిల్ హెల్త్ కార్డు యాప్‌లో మట్టి నమూనాలు సేకరించే పొలం రైతు వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆ తర్వాత ఆర్ఎస్‌కే సిబ్బంది క్షేత్రస్థాయిలో పొలాలకు వెళ్లి, రైతుల సమక్షంలోనే మట్టి నమూనాలు తీయాలి. తర్వాత అక్కడే సదరు రైతుతో సెల్ఫీ దిగి, యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. తర్వాత సాయిల్ హెల్త్ కార్డు నంబరు వివరాలు సదరు రైతు సెల్‌ఫోన్‌కు సమాచారం వస్తుంది. ఆ నంబర్ ఆధారంగానే మట్టి పరీక్షలు చేసిన తర్వాత యాప్‌లో ఫలితాలను భూసార పరీక్షాకేంద్రం అధికారులు అప్‌లోడ్ చేస్తారు. ఆ తర్వాత భూసార హెల్త్ కార్డులను మండల వ్యవసాయాధికారి ద్వారా రైతులకు అందజేస్తారు.



భూసార పరీక్ష కేంద్రంలోని పరికరాలు

ఉపయోగాలు..

- పొలంలో వివిధ పోషకాల స్థాయి తెలుస్తుంది.
- పొలాల్లో ఏయే పంటలు పండించుకోవచ్చో తెలుసుకోవచ్చు.
- ఎరువులను ఎంత మోతాదులో.. ఎప్పుడు వేయాలో తెలుస్తుంది.
- నేల సమస్యలైన కారు చౌడు, పాల చౌడు స్థితి తెలుస్తుంది.
- ఎరువుల వాడకంపై అనవసర ఖర్చు తగ్గించుకోవచ్చు.
- అధిక దిగుబడులు సాధించేందుకు దోహదపడుతుంది.

సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

పంటకోత తర్వాత మట్టి నమూనాలు సేకరించాలి. వేసవిలో, పంటలేని సమయాల్లోనే మట్టి నమూనాలు సేకరించాలి. ఎరువులు వేసిన తర్వాత నెల రోజులదాకా మట్టి నమూనాలు తీయకూడదు. నీరు పెట్టిన తర్వాత తీయకూడదు. నీడ పడే ప్రదేశాలు, నీటి ముందు ప్రాంతాలు, ఎరువు కుప్ప, గట్లు, చెట్లు దగ్గర మట్టి నమూనాలు ఎట్టి పరిస్థితుల్లోనూ సేకరించరాదు. పొలానికి ఒక నమూనా మాత్రమే తీయాలి. పొలం ఎక్కువ విస్తీర్ణంలో ఉంటే ప్రతి 2 నుంచి 5 ఎకరాలకు ఒకటి సేకరించొచ్చు. నేల నిర్మాణం, రంగు, మురుగు పారుదల సౌకర్యం, నేలవాలు, చౌడు, క్షార, ఆమ్ల గుణాలు, పంటల సరళి తదితర విషయాల్లో తేడా కనిపిస్తే అందుకు సంబంధించిన అన్ని నమూనాలు ఆయా పొలాల నుంచి తీసుకోవాలి.

సేకరించే విధానం..!

పైరు పంటలకు 6 అంగుళాల లోతులో మట్టి నమూనా తీయాలి. పండ్ల తోటల్లో 5 నుంచి 6 అంగుళాల వరకు ప్రతి అడుగుకు నమూనా తీసుకోవాలి. చౌడు, ఆమ్ల నేలల్లో అడుగు లోతులో ప్రతి 6 అంగుళాలకు ఒక నమూనా తీయాలి. నేలపై ఉన్న గడ్డి, చెత్త, కలుపు తదితర వాటిని తీసివేయాలి. ఆగర్‌గానీ, పారగానీ ఉపయోగించాలి. పొలంలో వి ఆకారంతో గోతులు తీయాలి. గొయ్యి అంచుల నుంచి పారగానీ, తాపీతోగానీ మట్టిని సేకరించాలి. పొలంలో 8-10 చోట్ల ఈ పద్ధతిలో మట్టి తీసుకోవాలి. సేకరించిన మట్టినంతటినీ కలిపి నేల మీద పరిచి, 4 భాగాలు చేయాలి. మూలలకు ఎదురుగా ఉన్న భాగాల మట్టిని తీసుకుని, మిగిలిన మట్టిని పడేయాలి. ఇలా అర కిలో మట్టి నమూనాను సేకరించాలి. దానిని గుడ్డగానీ, పాలిథీన్ సంచిలోగానీ భద్రపరచాలి. రైతు పేరు, చిరునామా, సర్వే నంబర్, పొలం విస్తీర్ణం, మెట్ట, పల్లం, ఆరుతడి పంటల వివరాలు నమోదు చేయాలి. గత మూడేళ్లలో ఆయా పొలాల్లో వాడుతున్న ఎరువులు, వేయాల్సిన పంటలు, మట్టి నమూనా సేకరించిన తేదీ తదితర వివరాలను జత చేయాలి. ఇలాంటి సమాచార పత్రంతో కూడిన మట్టి నమూనాలను భూసార పరీక్షా కేంద్రంలో అందజేయాలి.

పరీక్షలు ఎందుకంటే..?

పొలం నుంచి సేకరించిన మట్టిని వివిధ భౌతిక, రసాయన పద్ధతుల ద్వారా విశ్లేషించి, ఎంత మోతాదులో ఎరువులు, రసాయన మందులు వాడాలో తెలుసుకోవడమే భూసార పరీక్ష ముఖ్య ఉద్దేశం. భూసార పరీక్షలు చేయించి, వాటిని ఆచరించడం ద్వారా అనేక లాభాలున్నాయి. పంటలో స్థిరమైన దిగుబడులు, నాణ్యమైన ఉత్పత్తి సాధించవచ్చు. అధిక దిగుబడులు పొందాలన్న ఆలోచనతో రైతులు అనవసరంగా ఎక్కువ స్థాయిలో ఎరువులు వాడటం ద్వారా నాణ్యమైన దిగుబడులు రాకపోగా.. చీడపీడల ఉధృతి, వాతావరణ కాలుష్యం, చౌడు తదితర సమస్యలు ఎక్కువవుతున్నాయి. ఇలాంటి వాటిని అధిగమించాలంటే నేలకు సంబంధించిన స్థితిగతులను తప్పనిసరిగా తెలుసుకోవాలి. ఇందుకోసం నేల భౌతిక, రసాయన లక్షణాలు తెలియజేసే భూసార పరీక్షలు చేయించుకోవాలి. ఫలితాల ఆధారంగా అవసరం మేరకే ఎరువులు వాడుకోవాలి. అప్పుడే మెరుగైన దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.



అనంత భూసార పరీక్షా కేంద్రం

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



ఈ ఏడాది జిల్లాలో 25,107 భూసార పరీక్షలు చేయాలని ప్రభుత్వం లక్ష్యం విధించింది. మే 25వ తేదీదాకా క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు, సిబ్బంది నిర్దేశించిన మేరకు మట్టి నమూనాలు సేకరించి, అనంతపురం భూసార పరీక్షా కేంద్రానికి పంపాలి. ఎప్పటికప్పుడు భూసార పరీక్షలు నిర్వహించి, ప్రత్యేక యాప్‌లో ఫలితాలను అప్‌లోడ్ చేస్తాం. రైతు సేవాకేంద్రాల్లో సిబ్బందిని రైతులు సంప్రదించి భూసార పరీక్షలు చేయించుకునేందుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆ తర్వాత సిబ్బంది.. రైతుల పొలాల్లో మట్టి నమూనాలు సేకరించి, రైతులతో కలిసి సెల్ఫీ తీసుకుని యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

- రోజాపుష్పలత, ఏడీ, అనంతపురం భూసార పరీక్షాకేంద్రం


లీప్..!

టీచర్లకు తప్పిన యాప్ కష్టాలు

అన్నింటికీ ఒకే యాప్

అందుబాటులోకి లీప్

ఉపాధ్యాయ వర్గాల హర్షం



ధర్మవరం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖలో అనేక సంస్కరణలు తీసుకొస్తోంది. ఉపాధ్యాయులకు పని భారం తగ్గించేలా పలు చర్యలు చేపట్టింది. ఇటీవలి వరకు వివిధ యాప్‌లలో వివరాల నమోదుకు ఆపసోపాలు పడేవారు. యాప్‌ల భారాన్ని తగ్గిస్తామని ఎన్నికల సమయంలో ఉపాధ్యాయులకు ఇచ్చిన మాటను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నిలబెట్టుకున్నారు. తాజాగా ఒకే యాప్‌లో అన్నిసేవలు, విధులు నమోదు చేసుకునేలా లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (లీప్) పేరుతో సమగ్ర యాప్‌ను వారం రోజుల క్రితమే అందుబాటులోకి తీసుకొచ్చారు. పాఠశాలలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఖాళీల వివరాలు, ప్రభుత్వ సమాచారం, గవర్నెన్స్, డ్యాష్ బోర్డు నిక్షిప్తం చేశారు. దీని పనితీరును ఉపాధ్యాయులు పరిశీలిస్తున్నారు. పదో తరగతి ఫలితాలు సైతం ఈ యాప్‌లో నిక్షిప్తం కానున్నాయి. శ్రీసత్యసాయి జిల్లావ్యాప్తంగా 2,098 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. వీటిలో 1,48,453 మంది విద్యార్థులు చదువుతున్నారు. 33,590 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు.

గతంలో ఎన్నో సమస్యలు

గత వైసీపీ పాలనలో ఒక్కో వివరం నమోదుకు ఒక్కో యాప్ తీసుకొచ్చారు. దీంతో అన్ని యాప్‌లలో వివరాల నమోదుకు టీచర్లు తిప్పలు పడేవారు. నెట్‌వర్క్, సర్వర్ మొరాయించడం వంటి సమస్యలు ఉపాధ్యాయులకు తలనొప్పిగా మారేవి. పాఠశాల సమయానికి ముఖ ఆధారిత హాజరు వేయాలంటే ఇబ్బందులు పడేవారు. విద్యార్థుల హాజరు, వంట నిర్వహణ, మరుగుదొడ్ల చిత్రాల అప్‌లోడ్, సెలవుల నమోదుకు ఇబ్బందులు ఎదురయ్యేవి. పాఠ్యపుస్తకాల పంపిణీ, మనబడి నాడు-నేడు, పీఎంశ్రీ తదితర వివరాల నమోదుకు వేర్వేరు యాప్‌లు ఉండేవి. వాటి ఐఈడీలు, పాస్‌వర్డ్‌లు గుర్తు పెట్టుకోలేక, సెలవు రోజుల్లో ఇతరులకు ఆ వివరాలు ఇవ్వలేక ఇబ్బందులు పడేవారు. ముఖ హాజరుకు నెట్‌వర్క్, సర్వర్ బిజీతో గంటల తరబడి వేచిచూసేవారు. తాజాగా ముఖ ఆధారిత హాజరు గుర్తింపు సంఖ్య పాస్‌వర్డ్‌తో లీప్ యాప్‌లో లాగిన్ అయ్యేలా ఏర్పాట్లు చేశారు. యాప్‌లోనే స్కూల్, టీచర్, స్టూడెంట్, గవర్నెన్స్, కమ్యూనికేషన్, డ్యాష్‌బోర్డు అనే ఆరు విభాగాలున్నాయి. సాంకేతికంగా మెరుగుపరిస్తే మరింత ఉపయోగకరంగా ఉంటుందని టీచర్లు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

లీప్ యాప్.. టీచర్లకు ఎంతో ప్రయోజనం

ప్రభుత్వం ఇటీవల అందుబాటులోకి తీసుకొచ్చిన లీప్ యాప్‌తో టీచర్లకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ఇప్పటికే డౌన్‌లోడ్ చేసుకున్నారు. టీచర్లకు సంబంధించి ఉత్తర్వులు, బదిలీలు, నోటిఫికేషన్లు వంటివి పొందుపరచడం ద్వారా తాజా సమాచారం తెలుసుకోవచ్చు. బడులకు సంబంధించి అన్ని కార్యకలాపాలు దీని ద్వారానే నిర్వహిస్తాం.

- కిష్టప్ప, జిల్లా విద్యాధికారి

మంత్రి గారూ.. ఇటు చూడరూ..!

మంత్రి ఇలాఖాలో ఇన్‌చార్జి అధికారులే దిక్కు

కూడేరు, విడపనకల్లులో తహసీల్దార్, వజ్రకరూరులో ఎంపీడీఓ పోస్టులు ఖాళీ

కుంటుపడుతున్న పాలన



ఉరవకొండ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఇన్‌చార్జి అధికారులే దిక్కయ్యారు. కీలక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అధికారుల పర్యవేక్షణ లేక సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో పాలన కుంటుపడుతోంది. నియోజకవర్గంలో తహసీల్దార్, ఎంపీడీఓ పోస్టులు ఖాళీగా ఉండడంతో ఇన్‌చార్జి అధికారులతో నెట్టుకొస్తున్నారు. ఉరవకొండ తహసీల్దార్ మహబూబ్ బాషాను కూడేరుకు ఇన్‌చార్జిగా నియమించారు. దీంతో ఆయన కూడేరులోనే ఎక్కువ సమయం వెచ్చిస్తున్నారు. ఉరవకొండలో తహసీల్దార్ అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కూడేరులో 8 నెలలుగా తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉంది. సీఎస్ డీటీ, సీనియర్ అసిస్టెంట్లు కూడా లేరు. బెళుగుప్ప నుంచి ఆర్ఐ బదిలీపై వచ్చిన కొన్నిరోజులకే దీర్ఘకాలిక సెలవులో వెళ్లారు. ఉరవకొండలో కూడా డిప్యూటీ తహసీల్దార్ సెలవులో ఉన్నారు. విడపనకల్లు మండలంలో తహసీల్దార్ రెండు నెలల క్రితం ఉద్యోగోన్నతిపై వెళ్లడంతో డీటీకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. వజ్రకరూరులో ఎంపీడీఓ లేకపోవడంతో ఇన్‌చార్జితో నెట్టుకొస్తున్నారు. ఉరవకొండతోపాటు వజ్రకరూరు రవిప్రసాద్ రెండుచోట్ల విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక్కడ పర్యవేక్షణ లేకపోవడంతో కార్యాలయంలోని సిబ్బంది ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతున్నారు. ఉపాధి హామీ పథకం ఏపీడీ కూడా ఇన్‌చార్జి అధికారే ఉన్నారు. ఆయన తాడిపత్రితోపాటు ఇక్కడ పనిచేస్తున్నారు.

రెగ్యులర్ అధికారులను నియమించాలి

రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కూడేరు, ఉరవకొండకు తహసీల్దార్ ఒక్కరే కావడంతో కార్యాలయానికి ఎప్పుడు వస్తారో తెలియని పరిస్థితి. రైతులు, ప్రజలు సర్టిఫికెట్లు సకాలంలో అందక ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గ కేంద్రంలో తహసీల్దార్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి.

-రంగారెడ్డి, కౌలు రైతు సంఘం నాయకుడు

ఇన్‌చార్జి అధికారులతోనే..

నియోజకవర్గంలో ఎంపీడీవో, తహసీల్దార్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కూటమి అధికారంలోకి వచ్చి 10 నెలలవుతున్నా ఇన్‌చార్జి అధికారులతోనే నెట్టుకొస్తున్నారు. పర్యవేక్షణ లేకపోవడంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతున్నారు.

- విరుపాక్షి, సీపీఎం నాయకుడు

క్రైం కార్నర్

గొలుసు.. కమ్మలను లాక్కెళ్లిన దొంగలు


గాయపడిన జయమ్మ

సోమందేపల్లి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాకర్లపల్లి వద్ద కిష్టప్ప ఫామ్‌హౌస్ సమీపంలో జయమ్మ అనే వృద్ధురాలి మెడలోని గొలుసు, కమ్మలను దుండగులు లాక్కెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జయమ్మ సంతలో జామకాయలు అమ్ముకుని జీవిస్తోంది. శుక్రవారం రైల్వే బ్రిడ్జివద్ద ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చారు. జామకాయలు కొంటున్నట్లు నటించి ఆమె మెడలోని బంగారు గొలుసు, చెవిలోని కమ్మలను లాక్కుని పరారయ్యారు. బాధితురాలి కేకలు విన్న స్థానికులు దొంగలను పట్టుకునేందుకు ప్రయత్నించగా వారు వేగంగా వెళ్లిపోయారు. గాయపడిన జయమ్మను సోమందేపల్లి ఆస్పత్రికి తరలించారు. ఈమె సోమందేపల్లి స్నేహలతనగర్‌లో నివాసముంటుంది. రోజూ రైల్వే బ్రిడ్జి వద్దకెళ్లి వ్యాపారం చేసుకుంటుండేది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువరైతు మృతి


వీరాంజనేయులు (ఫైల్)

ధర్మవరం రూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటతిమ్మాపురం గ్రామానికి చెందిన యువరైతు సాకే వీరాంజనేయులు (31) విద్యుదాఘాతంతో శుక్రవారం మరణించాడు. ఈనెల 24న సాయంత్రం తన పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజులు వేస్తుండగా కరెంటు షాక్ తగిలింది. తీవ్రంగా గాయపడిన యువ రైతును అనంతపురం ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం శుక్రవారం బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరాంజనేయులుకు భార్య రాజేశ్వరి, కుమార్తె ఉన్నారు. ప్రమాదంపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

వడదెబ్బతో వృద్ధుడు..


నరసింహుడు (ఫైల్)

రాప్తాడు, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన తలారి నరసింహుడు (65) వడదెబ్బతో శుక్రవారం మృతి చెందాడు. తలారి నరసింహుడు రోజూ ఉపాధి పనులకు వెళ్లేవాడు. ఈక్రమంలోనే సోమవారం ఉపాధి పనులు చేస్తుండగా సొమ్మసిల్లి పడిపోయాడు. చికిత్స నిమిత్తం సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందిన తరువాత ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఎండవేడిమి పెరగడంతో తట్టుకోలేక శుక్రవారం ఇంట్లోనే మృతి చెందాడు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి దగ్గుపాటి శ్రీనివాసులు, గోనిపట్ల శీనా, పంపు ఇంద్ర తదితరులు తలారి నరసింహులు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

వ్యక్తి అదృశ్యం


మంజునాథ్

సోమందేపల్లి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాలాజీనగర్‌కు చెందిన మంజునాథ్ ఈనెల 13నుంచి కనబడుటలేదని కుటుంబ సభ్యులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ.. మంజునాథ్ 13న ఇంటి నుంచి వెళ్లిపోయాడన్నారు. పలు చోట్ల గాలించినా ప్రయోజనం లేదన్నారు. ఆచూకీ తెలిస్తే 6300661634, 7207054074 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

అత్తింటి వేధింపులు భరించలేకున్నా..!

- ఆత్మహత్య చేసుకుంటున్నా.. న్యాయం చేయండి
- సోషల్ మీడియాలో తాడిపత్రివాసి సెల్ఫీ వీడియో


వీడియోలో మాట్లాడుతున్న విశ్వనాథ్

తాడిపత్రి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): అత్తింటివారి వేధింపులు తాళలేక ఆత్మహత్యకు పాల్పడుతున్నానని, తన చావుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని తాడిపత్రి జయనగర్ కాలనీకి చెందిన విశ్వనాథ్ అనే వ్యక్తి అధికారులను కోరాడు. అతని సెల్ఫీ వీడియో సోషల్ మీడియాలో శుక్రవారం వైరల్ అయింది. అందులోని వివరాల మేరకు.. కడప జిల్లా వీరపునాయనిపల్లి మం డలం అలివేల ఓబాయపల్లికి చెందిన గంగమ్మ, రాంప్రసాద్ దంపతుల కూతురు హరిణిని విశ్వనాథ్ మూడేళ్లక్రితం వివాహం చేసుకున్నాడు. వివాహమైన ఏడాది నుంచి విశ్వనాథ్‌కు మరో మహిళతో వివాహేతర సంబంధం ఉందని అత్తింటివారు అతని భార్య హరిణికి చెప్పారు. అత్త గంగమ్మ, ఆమె కుమారుడు వంశీకృష్ణ, ఆ ఊరి పెద్దలు విశ్వనాథ్‌ను వేధించారు. మానసిక క్షోభను తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటున్నానని, ఆ దృశ్యాలను లైవ్‌లో చూపిస్తానని విశ్వనాథ్ పేర్కొన్నాడు. తన చావుకు కారణమైన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. తన లాంటి మగవారికి అన్యాయం జరగకుండా, వారికి బుద్ధి వచ్చేలా చర్యలు ఉండాలని కోరాడు. తన బాధను అర్థం చేసుకోవాలని, తన కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరాడు. విశ్వనాథ్ వీడియోను చూసిన అతని భార్య హరిణి, అత్త గంగమ్మ తాడిపత్రి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎలాగైనా తన భర్త ఆచూకీ తెలపాలని హరిణి పోలీసులను కోరింది. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

ఆర్డీటీ సెట్ రద్దు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ సెట్‌ను ఈ ఏడాది రద్దు చేసినట్లు ఆ సంస్థ శుక్రవారం తెలిపింది. దశాబ్ద కాలానికిపైగా ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఇంటర్‌లో కార్పొరేట్ విద్య అందించేందుకు ఆర్డీటీ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఎఫ్‌సీఆర్ఏ సమస్య నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో ఈ ఏడాది వేలాది మంది పేద విద్యార్థులకు నష్టం జరగనుంది. తప్పని పరిస్థితుల్లో ఆర్డీటీ సెట్‌ను రద్దు చేసినట్లు ఆ సంస్థ అధికారులు పేర్కొన్నారు.


వాహనాలకు పూజలు చేస్తున్న మాజీ మంత్రి గీతారెడ్డి


జెండా ఊపి ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఆర్‌జే రత్నాకర్

కదిలింది.. ప్రేమ రథం

సత్యసాయి బోధనల ప్రచారానికి తరలిన ప్రేమప్రవాహిని రథాలు

పుట్టపర్తి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి అందించిన ప్రేమ, సేవ, ఆధ్యాత్మిక బోధనలను దేశవ్యాప్తంగా ప్రచారం చేసేందుకు సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథాలను శుక్రవారం ప్రారంభించారు. ప్రశాంతినిలయంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. మాజీ మంత్రి గీతారెడ్డి వాహనాలకు పూజలు చేశారు. భక్తుల మంగళవాయిద్యాలు, భక్తిపాటలతో ప్రచార రథాలు బయల్దేరి వెళ్లాయి. వీటి ద్వారా 18నెలల పాటు 5 జోన్ల పరిధిలో ఉత్తర, దక్షిణ, తూర్పు, పశ్చిమ ప్రాంతాలలో సత్యసాయి తత్వాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తారు. నవంబరు 2026 వరకు దేశవ్యాప్తంగా ప్రచారం సాగుతుంది. ఇందుకోసం ప్రత్యేకంగా 5 రథాలను తయారుచేశారు. రథంలో సత్యసాయి చిత్ర పటం ప్రత్యేకంగా ప్రతిష్ఠించారు. భక్తుల దర్శనం కోసం సత్యసాయి పాల రాతి పాదకులను రథంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసంస్థల జాతీయ అధ్యక్షుడు నిమీష్‌పాండే, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల సేవా సంస్థల ప్రతినిధులు లక్ష్మణరావు, వెంగళరావుతోపాటు పలువురు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూకి ఐసీఐసీఐ ఫౌండేషన్ సహకారం

రూ.50లక్షల నుంచి రూ.5కోట్ల వరకు అభివృద్ధి పనులు


మాట్లాడుతున్న వీసీ సుదర్శనరావు

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ అభివృద్ధికి సహకారం అందించేందుకు ఐసీఐసీఐ ఫౌండేషన్ ముందుకొచ్చింది. ఎకాలజీ అండ్ ఎన్విరాన్‌మెంట్, హెల్త్‌కేర్, స్కిల్స్, ల్యాబ్స్, ఇంకుబేషన్ సెక్టార్లను అభివృద్ధి చేసేందుకు ఐసీఐసీఐ సంస్థ సుముఖత తెలిపింది. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద రూ.50లక్షల నుంచి రూ.5కోట్ల వరకు నిధులు వెచ్చించనున్నారు. తక్షణం రూ.50లక్షల విలువైన అభివృద్ధి పనులు చేపట్టేందుకు సంస్థ అంగీకారం తెలిపింది. ఇందులో భాగంగా సీవేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ) నిర్మాణం, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీరింగ్‌లో ల్యాబ్, హాస్టల్స్‌లో ఫుడ్ వేస్టేజ్, హెల్త్‌సెంటర్‌లో ల్యాబ్ పరికరాలను ఏర్పాటు చేసేలా వర్సిటీ అధికారులు ప్రతిపాదించారు. ఈ పనులను పూర్తిచేసిన అనంతరం మిగిలిన నిధులతో ఇంకుబేషన్‌లో స్టార్టప్స్, నైపుణ్యాల పెంపు, ల్యాబ్స్ ఎస్టాబ్లిష్‌మెంట్ చేయనున్నారు. ఈ మేరకు శుక్రవారం జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్యను ఐసీఐసీఐ ఫౌండేషన్ సంస్థ ప్రతినిధి శరత్‌కుమార్ కలిశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు మాట్లాడుతూ.. సాంకేతిక విద్యారంగంలో సానుకూల పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఇందులో భాగంగా జేఎన్‌టీయూ అభివృద్ధికి వివిధ కార్పొరేట్ సంస్థలు ముందుకు వస్తున్నాయన్నారు. ఇప్పటికే కియ తదితర సంస్థలు ఒప్పందం కుదుర్చుకున్నాయన్నారు. ఐసీఐసీఐ ఫౌండేషన్ సంస్థ సీఎస్ఆర్ కింద రూ.5కోట్ల వరకు నిధులు వెచ్చించి సెక్టార్లవారీగా అభివృద్ధి చేసేందుకు ముందకు వచ్చిందన్నారు. అందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించి, సంస్థ ప్రతినిధులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

యుక్తవయసు బాలికల భద్రతపై శ్రద్ధ



మాట్లాడుతున్న నరసింహమూర్తి

అనంతపురం విద్య, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు ఇతర సామాజిక దురాచారాల నుంచి యుక్తవయసు బాలికలకు భద్రత కల్పించాలనీ, అందుకు అన్ని వ్యవస్థలు ఐక్యంగా శ్రమించాలని యునిసెఫ్ ప్రతినిధులు, అధికారులు పిలుపునిచ్చారు. నగరంలోని ఓ హోటల్‌లో అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాల అధికాలతో కిశోరి వికాసంపై శుక్రవారం ఒకరోజు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన యునిసెఫ్ ప్రతినిధులు నరసింహమూర్తి, మేరీ జోన్స్ మాట్లాడుతూ.. అన్నిశాఖల అధికారులు కలిసికట్టుగా బాల్యవివాహాలను అరికట్టాలన్నారు. ఆ దిశగా అందరూ కృషి చేయాలన్నారు. అనంతరం జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, ఐసీడీఎస్ పీడీ నాగమణి, అన్నమయ్య డీఎల్‌పీఓ అమర్‌నాథ్‌రెడ్డి, ఏపీసీ శైలజ మాట్లాడుతూ..... యుక్తవయసు బాలికల సాధికారత కోసం క్యాలెండర్ ప్రకారం కార్యక్రమాలు చేయాలని సూచించారు. టీనేజీ ప్రెగ్నెన్సీని నియంత్రించాలని సూచించారు. బాల్యవివాహాల జరిగే ప్రాంతాలను గుర్తించి, ప్రణాళికతతో పీసీపీఎన్‌డీటీ యాక్ట్ అమలు చేయాలన్నారు. బడిబయట తిరిగే పిల్లలను గుర్తించి, స్కూళ్లలో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో పలుశాఖల అధికారులు పీడీ శ్రీదేవి, డిప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు, సీఐ వెంకటేశ్వర్లు, పలువురు సీడీపీఓలు చైల్డ్‌లైన్ అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ ఫీజు చెల్లింపు

అనంతపురం విద్య, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఏపీ ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు శనివారం నుంచి చెల్లించవచ్చని డీఈఓ ప్రసాద్‌బాబు, ఏసీ గోవింద్ నాయక్ ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 19 నుంచి 24వ తేదీ వరకూ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఆయ తేదీల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ పరీక్షలుంటాయన్నారు. ఇంటర్ ప్రాక్టికల్స్ మే 26 నుంచి 30వ తేదీ వరకూ నిర్వహిస్తారన్నారు. పరీక్షల ఫీజు నెలాఖరు వరకూ ఫైన్ లేకుండా చెల్లించవచ్చన్నారు. రూ.25 ఫైన్‌తో మే1, 2 తేదీల్లోపు, రూ.50 ఫైన్‌తో మే 3, 4 తేదీల్లోపు, తత్కాల్ కింద మే 5వతేదీలోగా చెల్లించవచ్చన్నారు. టెన్త్‌కు ఒక సబ్జెక్టుకు రూ.100, ఇంటర్‌కు సబ్జెక్టుకు రూ. 150, ఇంటర్ ప్రాక్టికల్స్‌కు రూ.100 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. వివరాలకు ఓపెన్ స్టడీ సెంటర్ల కోఆర్డినేటర్లనుగానీ, ఓపెన్‌స్కూల్ కార్యాలయంలోగానీ సంప్రదించాలన్నారు.

ఆర్జేడీ బ్లాగ్‌లో జోన్-4 సీనియారిటీ లిస్టు

అనంతపురం విద్య, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జోన్-4 పరిధిలోని ఉమ్మడి అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు జిల్లాలకు సంబంధించిన ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల స్కూల్ అసిస్టెంట్లు, హెచ్‌ఎంల సీనియారిటీ జాబితా rjdsekadapa.blogspot.com లో ఉంచినట్లు ఆర్జేడీ శామ్యూల్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు తమ సీనియారిటీ జాబితాను పరిశీలించాలని సూచించారు. అన్ని జిల్లాల విద్యా శాఖాధికారులు సైతం సీనియారిటీ జాబితాలను డీఈఓ బ్లాగ్స్‌లో అందుబాటులో ఉంచాలని ఆయన సూచించారు.

శభాష్.. వర్ష..!

జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు పులమతి విద్యార్థిని ఎంపిక


వర్ష

లేపాక్షి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న వర్ష జాతీయస్థాయి ఖేలో ఇండియా ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం సుబ్బారావు శుక్రవారం తెలిపారు. మహారాష్ట్రలో శనివారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో వర్ష రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికవడంతో వర్షను ప్రధానోపాధ్యాయుడు, పాఠశాల సిబ్బంది, తోటి విద్యార్థులు అభినందించారు.

పింఛన్ భరోసా..

- భర్త మరణిస్తే.. భార్యకు వర్తింపునకు కసరత్తు
- ఉమ్మడి జిల్లాలో 7,021 మందికి లబ్ధి

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): భర్తను పోగొట్టుకున్న వారికి కొత్త ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఎన్టీఆర్ భరోసా పింఛన్ పొందుతూ భర్త మరణిస్తే... భార్యకు వర్తింపజేయాలని కొత్త ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే ఇది అమలులో ఉంది. 2023 డిసెంబరు 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ఎంతమంది పింఛన్ పొందుతూ చనిపోయారో వివరాలు సేకరించే పనిలో ప్రభుత్వం నిమగ్నమైంది. చనిపోయిన లబ్ధిదారుడి భార్యకు పింఛన్ ఇచ్చేందుకు చర్యలు చేపడుతోంది. ఇప్పటికే అనంతపురం జిల్లాలో 3,775 మంది, శ్రీసత్యసాయిలో 3,246 మంది మొత్తంగా 7,021 మంది పింఛన్ పొందుతూ మరణించినట్లు చెబుతున్నారు. వారి భార్యలకు పింఛన్ అందించనున్నారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే మృతిచెందిన భర్తల వివరాలు ప్రభుత్వం వద్ద ఉన్నాయనీ, వారు పొందే పింఛన్ ఐడీ నంబర్లు, పేరు, భర్త మరణ ధ్రువీకరణ పత్రం, ఆధార్‌తో ఆయా గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈనెల 30వ తేదీలోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని డీఆర్‌డీఏ అధికారులు చెప్పారు.

ఈఓఆర్డీ, ఏఓలకు ఉద్యోగోన్నతి

- తాత్కాలిక ఎంపీడీఓలుగా నియామకం

అనంతపురం విద్య, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పలువురు డిప్యూటీ ఎంపీడీఓలు(ఈఓఆర్డీలు), అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లకు తాత్కాలిక ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి కల్పించారు. ఈ మేరకు పీఆర్ కమిషనర్ క్రిష్ణతేజ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగోన్నతి పొందినవారిలో కొందరిని ఉమ్మడి జిల్లాకు కేటాయించారు. అనంతపురం జిల్లాకు చెందిన డిప్యూటీ ఎంపీడీఓలు శివాజి రెడ్డి, జిలానీ బాషాను, శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన వెంకటలక్ష్మమ్మ, కర్నూలు జిల్లాకు చెందిన సూర్యనారాయణ, కర్నూలు జిల్లాకు చెందిన ఏఓ విజయసింహా, అనంతపురం జిల్లాకు చెందిన ఏఓ ధనుంజయనాథ్ అనంతపురం జిల్లాకు కేటాయించారు. శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన డిప్యూటీ ఎంపీడీఓలు నాగేశ్వర్‌రావు, కేశవరెడ్డి, నసీమా, మమత దేవి, నటరాజ్‌ను, ఏఓ రెడ్డప్పను అదే జిల్లాకు కేటాయించారు. వీరికి స్థానాలను కేటాయించాలని జడ్పీ సీఈఓను కమిషనర్ ఆదేశించారు.

పాత సర్క్యులర్‌ను అమలు చేయాలి

- ఆర్టీసీ ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వాలి
- ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు

ధర్మవరం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): గత టీడీపీ ప్రభుత్వంలో సాధించుకున్న 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని ఎంప్లాయీస్ యూనియన్(ఈయూ) రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు తెలిపారు. స్థానిక ఎన్జీఓ హోంలో శుక్రవారం ఈయూ జిల్లా అధ్యక్షుడు నాగార్జునరెడ్డి అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి దామోదరరావు, యూనియన్ కార్యదర్శి నరసయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగులకు ఆరేళ్లుగా పెండింగ్ పెట్టిన ప్రమోషన్లను వెంటనే ఇవ్వాలన్నారు. ఆర్టీసీలో క్లాస్ 4 ఉద్యోగుల నుంచి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వరకు 3500 మంది ఉద్యోగులు ప్రమోషన్ల కోసం ఎదురు చూస్తున్నట్లు తెలిపారు. గత 12ఏళ్లగా ఆర్టీసీలో కారుణ్య నియామకాలు తప్ప ప్రభుత్వ నోటిఫికేషన్ ద్వారా ఒక్క ఉద్యోగం భర్తీ చేయలేదన్నారు. దీంతో ప్రస్తుతం ఆర్టీసీలో వివిధ కేటగిరీలకు సంబంధించి దాదాపు 11వేలు పోస్టులు ఖాళీ ఉన్నాయన్నారు. వీటిని భర్తీ చేయాలని డిమాండ్ చేయాలన్నారు. ఉద్యోగులకు అరియర్స్ డీఏ బకాయిలుతో పాటు పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ఈహెచ్ఎస్ ద్వారా సరైన వైద్యసౌకర్యాలు అందక సంవత్సరానికి దాదాపు 350 మంది వరకు చనిపోతున్నందున పాత పద్ధతిలో ఆర్టీసీ ఉద్యోగులకు వైద్యసౌకర్యాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీలో హయ్యర్ పెన్షన్ కోసం యూనియన్ తరపున కృషి చేస్తున్నామన్నారు. సమావేశంలో ఈయూ రాష్ట్ర కార్యదర్శి నబీరసూల్, కడప జోన్ ఈయూ అధ్యక్షుడు కేకేకుమార్, జోనల్ కార్యదర్శి రాజశేఖర్, జిల్లా కార్యదర్శి జీవైసీరావు, జోనల్ నాయకులు శేఖర్, అరుణమ్మ, జిల్లా నాయకులు నారాయణస్వామి, ఆర్ఎస్‌రెడ్డి, ఏవీవీప్రసాద్, రమణప్ప, కేఎస్‌వాసులు, నరసింహులు, సుమోశీన పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు

సమీక్షకు వివరాలతో రావాలని తెలియదా..?

- ఏడీసీసీ బ్యాంకు అధికారులపై జేసీ అసహనం


సమీక్షలో మాట్లాడుతున్న జేసీ, ఏడీసీసీ బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): 'పూర్తి వివరాలతో సమీక్షా సమావేశాలకు రావాలని తెలియదా..' అని ఏడీసీసీ బ్యాంకు అధికారులపై జాయింట్ కలెక్టర్, బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి శివనారాయణ శర్మ అసహనం వ్యక్తం చేశారు. స్థానిక ఎన్టీఆర్ సహకార భవన్‌లో శుక్రవారం జిల్లాస్థాయి మానిటరింగ్ కమిటీ సమీక్ష నిర్వహించారు. బ్రాంచ్‌లు, వాటి పరిధిలోని సొసైటీల వారీగా జాయింట్ కలెక్టర్ సమీక్షించారు. ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించట్లేదనీ, అధికారులు ఇలా నిర్లక్ష్యంగా పనిచేస్తే ఎలా అని ప్రశ్నించారు. తదుపరి సమావేశానికి పూర్తి వివరాలతో రావాలనీ, పురోగతి ఉండాలని సూచించారు. రైతులకు రుణాల మంజూరు,రికవరీ, డిపాజిట్ల సేకరణపై దృష్టి సారించాలన్నారు. అనంతరం డీసీఎంఎస్‌లో చేపడుతున్న కార్యక్రమాలపై సమీక్షించారు. కార్యక్రమంలో శ్రీసత్యసాయి జిల్లా సహకార శాఖాధికారి కృష్ణానాయక్, అనంతపురం డీఎల్‌సీఓ ప్రభాకర్ రెడ్డి, నాబార్డు డీడీఎం అనురాధ, ఏడీసీసీ బ్యాంకు సీఈఓ సురేఖారాణి, డీజీఎంలు ఏబీ రాంప్రసాద్, విజయచంద్రారెడ్డి, సుఖదేవ బాబు, డీసీఎంఎస్ మేనేజర్ విజయభాస్కర్ పాల్గొన్నారు.

యూపీఎస్, ఎన్‌పీఎస్ వద్దు

- సంఘ్ లోకో రన్నింగ్ స్టాఫ్ డిమాండ్



క్రూ కంట్రోల్ లాబీ వద్ద ఆందోళన చేస్తున్న ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు

గుంతకల్లు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కొత్త పెన్షన్ (ఎన్‌పీఎస్), యూనిఫైడ్ పెన్షన్ (యూపీఎస్)ను రద్దుచేసి, పాత విధానాన్ని పునరుద్ధరించాలని సంఘ్ లోకో రన్నింగ్ స్టాఫ్ (ఎల్ఆర్ఎస్) బ్రాంచ్ నాయకులు డిమాండ్ చేశారు. లోకో రన్నింగ్ స్టాఫ్ సమస్యలపై ఎంప్లాయీస్ సంఘ్ ఎల్ఆర్ఎస్ బ్రాంచ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం రైల్వే స్టేషన్‌లోని క్రూ కంట్రోల్ లాబీ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ్ ఎల్ఆర్ఎస్ బ్రాంచ్ కార్యదర్శి సుభానుల్లా మాట్లాడుతూ.. రైలింజన్లలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను తొలగించాలని, లోకోలు ఫాగ్ సేఫ్టీ డివైజ్‌లను ఏర్పాటు చేయాలని, రన్నింగ్ స్టాఫ్‌పై పని ఒత్తిడి తగ్గించాలని, హైస్పీడ్ రైళ్లలో విధులను నిర్వహించే రన్నింగ్ సిబ్బందికి అదనపు అలవెన్సు ఇవ్వాలని, పని సమయాల్లో భోజన వేళలు, వాష్ రూం వేళలను పాటించాలని డిమాండ్ చేశారు. 25 శాతం కి.మీ. అలవెన్సును 50 శాతం డీఏ కంటే అధికంగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సంఘ్ లోకో రన్నింగ్ స్టాఫ్ బ్రాంచ్ సభ్యులు పాల్గొన్నారు.

రైతుల నమోదుపై దృష్టి పెట్టండి

- జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ


మాట్లాడుతున్న ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతులతో ఏపీ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. స్థానిక జేడీఏ కార్యాలయంలోని సమావేశపు హాల్‌లో శుక్రవారం అనంతపురం ఏడీఏ రవితో కలిసి డివిజన్ పరిధిలోని ఏఓలు, ఏఈఓలు, రైతు సేవా కేంద్రం సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. గడువులోగా ఏపీ ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తిచేసేలా ఏఓలు పర్యవేక్షించాలన్నారు. అర్హులైన రైతులకు యాంత్రీకరణ పరికరాలు మంజూరు చేయాలన్నారు. వచ్చే ఖరీఫ్‌లో విత్తన పంపిణీతోపాటు ఎరువులకు సంబంధించి ముందస్తుగా ప్రణాళికలు రూపొందించి, పొరబాట్లకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎల్‌డీఎంగా నరేష్‌రెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఎల్‌డీఎంగా నరేష్‌రెడ్డి నియమితులయ్యారు. కెనరాబ్యాంకు ముంబై సర్కిల్ పరిధిలోని పూణేలో మేనేజర్‌గా పనిచేస్తున్న విజయవాడకు చెందిన నరేష్‌రెడ్డిని అనంతపురం జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్‌గా బదిలీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న ఎల్‌డీఎం నరసింహారావును హైదరాబాద్‌కు బదిలీ చేశారు. సోమవారం నరసింహారావు రిలీవై, నరేష్ రెడ్డి బాధ్యతలు స్వీకరించనున్నారు.

న్యూస్ బాక్స్

అపుస్మా రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం



రాష్ట్ర నాయకులను సన్మానిస్తున్న జిల్లా నేతలు

అనంతపురం విద్య, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : అపుస్మా రాష్ట్ర అధ్యక్షుడు తులసి విష్ణుప్రసాద్, ఐటీ అడ్వైజర్ మస్తాన్‌రావును ఆ సంఘం జిల్లా నాయకులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం జిల్లాకు వచ్చిన వారిని కమలానగర్‌లోని ఆ సంఘం కార్యాలయంలో అపుస్మా జిల్లా నేతలు కలిశారు. వారికి పుష్పగుచ్ఛాలు అందించి,శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. విద్యాహక్కు చట్టం 2009 12. 1(సీ) కి సంబంధించిన పలు సూచనలు, సలహాలను రాష్ట్ర నాయకులు వివరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కో ఆర్డినేటర్ పుల్లారెడ్డి, నాయకులు నాగరాజు, సుబ్బారెడ్డి, రవిశంకర్ ప్రసాద్, రామచంద్రారెడ్డి, సూర్యనారాయణరెడ్డి, మధుసూధన్‌రెడ్డి, శశిభూషన్, అన్వర్, శ్రీనివాసరెడ్డి, నార్పల శ్రీనివాస్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మలేరియా నివారణపై ర్యాలీ

అనంతపురంరూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలమూరు రోడ్డులో ఉన్న బాలాజీ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ మలేరియా వ్యతిరేక దినం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల పరిసర ప్రాంతాల్లో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మలేరియా లక్షణాలు, వ్యాప్తి విధానం, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ పల్లె కిశోర్ అభినందిచారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ వెంకటనారాయణ, ఏఓ సుధాకర్, రాజేంద్రప్రసాద్, వెంకటేష్ నాయక్ పాల్గొన్నారు.

● నార్పల : మండలంలోని బి. పప్పూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ మలేరియా వ్యతిరేక దినం సందర్భంగా వైద్యసిబ్బందికి, రోగులకు మలేరియాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి హాజీరా, పర్యవేక్షకులు శ్రీరాములు, అనుసూయమ్మ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు : సీఐ

గార్లదిన్నె, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని శింగనమల సీఐ కౌలుట్లయ్య హెచ్చరించారు. శుక్రవారం తెల్లవారుజామున గార్లదిన్నె, నార్పల ఎస్ఐలు మహ్మద్‌గౌస్‌బాషా, సాగర్‌తో కలసి సీఐ కౌలుట్లయ్య కొండకింద కల్లూరులో తనిఖీలు నిర్వహించారు. అనంతరం రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు.

సమాచార హక్కు చట్టం అమలుకు చర్యలు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పారదర్శకత, ప్రజాపాలనలో బాధ్యతాయుతమైన సేవలు అందించడమే సమాచార హక్కు చట్టం ముఖ్యఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో అధికారులు రేవతి, రత్నశిరోమణి, ఎక్సైజ్ సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

పిల్లలను బాగా చదివించండి

నార్పల,ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు పిల్లల్ని బాగా చదివించాలని వెంకట్ వకుళ ఫౌండేషన్ చైర్మన్ ఆలం వెంకట నరసానాయుడు పేర్కొన్నారు. మండలంలోని బొందలవాడ గ్రామానికి చెందిన కావ్యశ్రీ, యశ్విని, భార్గవి, గాయత్రి, శిరీష, దర్పణ, నవదీప్ పదో తరగతి పరీక్షల్లో 500 మార్కులు పైబడిన వారికి వకుళ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాసమూర్తి హాజరయ్యారు. ఈసందర్భంగా నరసానాయుడు మాట్లాడుతూ కావ్యశ్రీ 586 మార్కులు సాధించడం గ్రామానికి గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో ఆలం వెంకటనరసానాయుడు

పహల్గాం మృతులకు కొవ్వొత్తుల నివాళి







గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీఐటీయూ, యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు, జనసేన నాయకుల మానవహారం, ఎంఈఎఫ్ నాయకుల ర్యాలీ



మృతులకు కొవ్వొత్తులతో నివాళులు

(న్యూస్ నెట్‌వర్క్-ఆంధ్రజ్యోతి)

కశ్మీర్‌లోని పహల్గాం వద్ద ఉగ్రదాడిలో మృతి చెందినవారికి వివిధ ప్రజా సంఘాలు శుక్రవారం సాయంత్రం కొవ్వొత్తులతో నివాళులర్పించాయి. ఈ నేపథ్యంలో యూటిఎఫ్, ఎస్ఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో ఉపాధ్యాయ భవన్ నుంచి క్లాక్‌టవర్ వద్ద గాంధీ విగ్రహం వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉగ్రదాడిలో మృతిచెందిన పౌరులకు నివాళులర్పించారు. నాయకులు నాగేంద్రకుమార్, లింగమయ్య, ఓతూరు పరమేష్, గోవిందరాజులు, మహ్మద్ జిలాన్, రమణయ్య, కోటేశ్వరప్ప, శివానంద, సరళ, దేవేంద్రమ్మ, నాగమణి, ముత్తుజ, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు. మాదిగ ఉద్యోగుల సమాఖ్య(ఎంఈఎఫ్) ఆధ్వర్యంలో పహల్గామ్ మృతులకు సంతాపంగా క్లాక్‌టవర్ వద్ద కొవ్వొత్తుల నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్, నాయకులు రమేష్, కన్వీనర్ మంజు, కదిరప్ప, అమర్నాథ్, హనుమంతరావు, చంద్రశేఖర్, శీనా తదితరులు పాల్గొన్నారు. అహుడా చైర్మన్, జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ ఆధ్వర్యంలో సప్తగిరి సర్కిల్లో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు భవానీ రవికుమార్, పొదిలి బాబురావు, పెండ్యాల శ్రీలత, జయరాంరెడ్డి, సంజీవరాయుడు, కిరణ్‌కుమార్, జయమ్మ, విజయకుమార్, ఆదినారాయణ, వెంకటేష్, ఇమామ్ హుస్సేన్, చక్రపాణి పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహంవద్ద ఎస్సీ, ఎస్టీ సం ఘాల జేఏసీ, క్లాక్‌టవర్ వద్ద విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) నివాళులర్పించాయి. కార్యక్రమంలో నాయకులు సాకేహరి, శ్రీనివాసులు, రాము, రామకృష్ణ, వెంకటేష్, ఆది, విశ్వేశ్వరరెడ్డి, రత్నమయ్య, విశ్వనాథరెడ్డి, కిషోర్, హిమకర్ పాల్గొన్నారు. శింగనమలలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మాదిగ ఉద్యోగులు కొవ్వొత్తులతో శాంతిర్యాలీ నిర్వహించారు. జనసేన పార్టీ నాయకులు ఈశ్వర్, మురళికృష్ణ, పురుషోత్తరెడ్డి ఆధ్వర్యంలో మానహారం చేపట్టారు. ఎంఈఎఫ్ నాయకులు ఓబిలేసు, నల్లప్ప, రాము, సురేష్, సాయి, పాల్గొన్నారు.



శింగనమలలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ చేస్తున్న మాదిగ ఉద్యోగులు



నివాళులర్పిస్తున్న ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ నాయకులు



నివాళులర్పిస్తున్న వీహెచ్‌పీఎస్ నాయకులు

భూసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి: ఎమ్మెల్యే

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): భూ సమస్యలకు సంబంధించి అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయని, అధికారులు వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. చెన్నేకొత్తపల్లిలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యేకు వినతి రూపంలో చెప్పుకున్నారు. ఫిర్యాదుల్లో అధికంగా భూ సమస్యలకు సంబంధించినవే ఉన్నాయి. ఇం టిస్థలాలు, గృహాల మంజూరుకు సంబంధించి ర్జీలు ఇచ్చారు. పలు సమస్యలకు సంబంధించి ఎందుకు పరిష్కారం చూపలేదని అధికారులను ఆరాతీశారు. చుక్కల భూములు, ఫ్రీహోల్డ్ ఉన్న భూములకు సంబంధించి రెవిన్యూ అధికారులు పూర్తిగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేశ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బఫర్ పేరుతో డీలర్లను ఇబ్బంది పెట్టొద్దు

ప్రతినెలా బఫర్ పేరుతో డీలర్లకు స్టాక్ సరఫరాలో కోత విధిస్తుండటం వల్ల డీలర్లు సమస్యలు ఎదుర్కొంటున్నారని, వచ్చే నెల నుంచి తూకాల్లో ఎలాంటి తేడాలు లేకుండా పూర్తి కోటా రేషన్ ఇవ్వాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అధికారులను ఆదేశించారు. చెన్నేకొత్తపల్లిలోని సివిల్‌సప్లై స్టాక్ పాయింట్‌ను ఆమె తనిఖీ చేశారు. ప్రస్తుతం గోదాములో నిల్వ ఉన్న స్టాకు వివరాలను అడిగితెలుసుకున్నారు. గత నెలలో డీలర్లకు ఏ మేరకు బియ్యం సరఫరా చేశారని రికార్డులను పరిశీలించారు. వైసీపీ ప్రభుత్వంలో చేసిన తప్పిదాలతో ప్రస్తుతం ఉన్న డీలర్లు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేశ్‌కుమార్, సీఎస్‌డీటీలు, టీడీపీ నాయకులు ముత్యాల్‌రెడ్డి, అమరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన

రామగిరి : వచ్చే నెలలో నసనకోట దుర్గమ్మ ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఉత్సవాల ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిటాల సునీత పరిశీలించారు. అక్కడ పనిచేస్తున్న స్థానిక ప్రజలతో మాట్లాడారు. అక్కడ జరుగుతున్న పనుల గురించి సూచనలు, సలహాలు ఇచ్చారు.

సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే చర్యలు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): అర్బన్ ప్రజల సమస్యల పరిష్కారంపై ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే సూచనల మేరకు శుక్రవారం స్థానిక అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు గంగారామ్, అధికార భాషా సంఘం మాజీ చైర్మన్ హరికృష్ణ, కార్పొరేషన్ల డైరెక్టర్లు పరమేశ్వరన్, పీఎల్ఎన్ మూర్తి, పోతుల లక్ష్మీనరసింహులు, కడియాల కొండన్నలు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సైఫుద్దీన్ నెట్టెం బాలకృష్ణ, నాగభూషణం, వెంకటేశ్వరరెడ్డి, జేఎం బాషా, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అరుణాచలేశ్వరుడి అనుష్టానం

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి):సాయి ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం నగరంలో అరుణాచలేశ్వరుని అనుష్టానం నిర్వహించనున్నారు. మూడో రోడ్డులోని జీఆర్ ఫంక్షన్‌హాల్ 1వ గేట్‌లో అరుణాచలేశ్వరుని పూజలు చేపట్టనున్నారు. అరుణాచల ఆలయం నుంచి ఉత్సవమూర్తులను తీసుకురావడంతోపాటు అక్కడి పురోహితులే పూజలు చేయనున్నట్లు సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

అక్రమ మద్యం ధ్వంసం

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): వివిధ పాత కేసుల్లో పట్టుబడిన అక్రమ మద్యాన్ని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్, స్థానిక పోలీసులు శుక్రవారం ధ్వంసం చేశారు. ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి గోవిందనాయక్ ఆధ్వర్యంలో 22 కేసుల్లో పట్టుబడిన 98 లీటర్ల అక్రమ మద్యం బాటిళ్లను ధ్వంసం చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో 6.3లీటర్ల కర్నాటక మద్యాన్ని, 14.40లీటర్ల ఆంధ్రా అక్రమమద్యం బాటిళ్లను కూడా ధ్వంసంచేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ ఫరూక్ అజం, స్థానిక ఎస్ఐ సత్యనారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మేరీ ప్రత్యూషకు గిన్నిస్ రికార్డు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): నగరానికి చెంది న మేరీ ప్రత్యూష గుజ్జారికి గిన్నిస్ వరల్డ్ రికార్డ్సులో చోటు దక్కింది. హల్లెల్ మ్యూజిక్ స్కూల్ ఆధ్వర్యం లో 2024 డిసెంబరు 1న నిర్వహించిన ప్రపంచ స్థాయి సంగీత కార్యక్రమంలో 18 దేశాలకు చెందిన 1046 మంది కీబోర్డు సంగీత కళాకారులు పాల్గొన్నారు. అందులో అనంతపురం నగరానికి చెందిన మేరీ ప్రత్యూష గుజ్జారి పేరు కూడా నమోదైంది. ఈనెల 24న హైదరాబాద్‌లోని లైఫ్ చర్చిలో హల్లెల్ మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకుడు పాస్టర్ అగస్టిన్ దండింగి, బ్రదర్ అనీల్ కుమార్ నుంచి పత్రాన్ని అందుకున్నారు.



ధ్రువపత్రం అందుకుంటున్న మేరీ ప్రత్యూష

పండ్లతోటలు సాగుచేయండి: పీడీ

రాప్తాడు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని రైతులు ఊరూరా పండ్ల తోటలు సాగు చేయాలని డ్వామా పీడీ సలీంబాషా తెలిపారు. మండలంలోని హంపాపురం గ్రామంలో వాటర్‌షెడ్ ఆధ్వర్యంలో రైతు మధురనాథ్ పొలంలో శుక్రవారం బ్రహ్మజెముడు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. జిల్లాలో మొదటిసారిగా 2.5 ఎకరాల్లో బ్రహ్మజెముడు సాగు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీ సుధాకర్‌రెడ్డి, ఎంపీడీఓ విజయలక్ష్మి, వాటర్‌షెడ్ చైర్మన్‌లు మల్లికార్జున, యోగేంద్ర పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

కనగానపల్లి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన నాగభూషణ భార్య అంజినమ్మ(32) ఇంటిలో గొడవ పడి గురువారం రాత్రి పురుగుల మందుతాగింది. కుటుంబసభ్యులు వెంటనే అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో శుక్రవారం బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. కనగానపల్లి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏడీఏ రవికి సన్మానం

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): యాంత్రీకరణ పరికరాలు మంజూరులో ప్రత్యేక చొరవ చూపిన ఏడీఏ రవిని జేడీఏ కార్యాలయంలో శుక్రవారం సన్మానించారు. ఏఓలు శశికళ, సోమశేఖర్, శ్యాంసుందర్‌రెడ్డి, శ్రీవాణి, విజయ్‌కుమార్, సుచరిత, సాయి లక్ష్మి, ఏఈఓ మురళీ పాల్గొన్నారు.

మార్కెట్‌కు 1400 టన్నుల చీనీకాయలు

అనంతపురంరూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం చీనీ ఉత్పత్తులు పెరిగాయి. కొన్ని రోజులుగా 800 నుంచి 1200 టన్నుల మధ్య ఉత్పత్తులు వస్తున్నాయి. శుక్రవారం 1434 టన్నుల చీనీకాయలు మార్కెట్‌కు వచ్చాయి. ధరలో పెరగకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. టన్ను గరిష్ఠంగా రూ.21వేలు, కనిష్ఠంగా రూ.4వేలు, సరాసరి రూ.15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు.

కొనసాగిన మెడికల్ సర్టిఫికెట్ల పరిశీలన

నేటితో ముగియనున్న శిబిరం

అనంతపురం టౌన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజనాస్పత్రిలో టీచర్ల మెడికల్ సర్టిపికెట్ల పరిశీలనరెండోరోజు శుక్రవారం కూడా కొనసాగింది. మొత్తం ఐదు కౌంటర్లలో సరిఫికెట్ల పరిశీలన చేపట్టారు. శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన టీచర్లు హాజరయ్యారు. దాదాపు 300 మంది టీచర్ల మెడికల్ సర్టిఫికెట్లను పరిశీలించి, జారీ చేసినట్లు సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం పరిశీలన ముగుస్తుందనీ, మిగిలిన టీచర్లు అందరూ హాజరై వెరిఫికేషన్ చేయించుకోవాలని సూపరింటెండెంట్ తెలిపారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన వడ్డెర పేద విద్యార్థులు వడ్డెర సేవా సంఘం ఆధ్వర్యంలో త్వరలో అందించే ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్డే లక్ష్మీనారాయణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 500కిపైగా మార్కులు సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. మార్కుల జాబితా, ఫోన్ నంబరు తదితర వివరాలను 9441109916, 9866236626, 9908745966, 9949229870 నంబర్లకు వాట్సాప్ ద్వారా పంపాలన్నారు.

రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే చర్యలు : ఎస్ఐ

రామగిరి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, విద్వేష, అసత్యపూరితమైన పోస్టులు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని రామగిరి ఎస్ఐ సుధాకర్‌యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. మండలంలోని పాపిరెడ్డిపల్లి గ్రామ పరిసరాల్లో ఇటీవల కొన్ని సంఘటనల నేపథ్యంలో కొందరు వ్యక్తులు తమ స్వలాభం కోసం సామాన్య ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. సోషల్ మీడియాలో వాస్తవాలను వక్రీకరించి తప్పుడు ప్రచారాలు చేయడం, కుల,వర్గ భేదాలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు, పోస్టులు పెడుతున్నారని అన్నారు. ఈ చర్యలు శాంతి భద్రతలకు భంగం కలిగించేలా ఉన్నాయన్నారు. ప్రజలు ఆ ప్రచారాల ప్రభావానికి లోనుకాకుండా సంయమనం పాటించాలని విజ్ఞప్తిచేశారు.

కళాశాల గుర్తింపును రద్దుచేయాలి

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): అడ్డదారిలో ప్రవేశాలు చేస్తూ న్యాయవిద్యను కలుషితం చేస్తున్న శ్రీవిజయనగర లా కళాశాల గుర్తింపును రద్దుచేయాలని శుక్రవారం ఎస్కేయూ రిజిస్ట్రార్ రమేష్‌కు ఏఐఎస్ఏ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఆ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు వేమన మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు న్యాయవిద్య అందించాలన్న ఆకాంక్షను శ్రీవిజయనగర లా కళాశాల విద్యావ్యాపారంగా మార్చుకుంటుదని మండిపడ్డారు. వర్సిటీ నిబంధనలు ఉల్లఘించి అధిక ఫీజులను వసూలుచేస్తోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అడ్డదారుల్లో విద్యార్థులను దోచుకుందని పేర్కొన్నారు. విచారణచేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్, అశోక్, యామన్న పాల్గొన్నారు.



రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

చిన్న ఊరిపై చూపు..!

● అభివృద్ధికి ఆమడదూరం చిలేపల్లి..
● ఆర్టీసీ బస్సుకు నోచుకోని కుగ్రామం
● ఎన్నికల్లో హామీలు ● గెలిచాక.. ఇటు చూడని దుస్థితి







చిలేపల్లిలో రోడ్డుపైనే నిల్వ ఉన్న మురుగునీరు, మంచినీటి ట్యాంకు వద్దనే పశువుల పాక, పెద్దజలాలపురం నుంచి చిలేపల్లి వెళ్లే రోడ్డు దుస్థితి

శింగనమల, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలేపల్లిలో వంద కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వ్యవసాయ పనులే జీవనోపాధి. ఉదయం నుంచి సాయంత్రం వరకు వ్యవసాయ పనులతో బిజీగా గడుపుతారు. గ్రామానికి ఎర్రబస్సు కూడా రాదు. అభివృద్ధి జాడ కనిపించదు. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీల నాయకులు వచ్చి హామీలు గుప్పిస్తారనీ, గెలిచాక ఊరి వైపు కూడా చూడరని చిలేపల్లి వాసులు వాపోతున్నారు. గ్రామంలో బీసీ, ఎస్సీ వర్గాలవారు 500 మందికిపైగా ఉన్నారు. గ్రామంలో ఎక్కడ చూసినా పశువుల పేడ దిబ్బలు దర్శనమిస్తాయి. అపరిశుభ్రత తాండవిస్తుంటుంది. ప్రభుత్వ తాగునీటి బోరులో నీరు ఉన్నా.. ట్యాంకు ద్వారా సరాఫరా చేస్తున్నారు. ఆ ట్యాంకును ఐదేళ్లకోసారి కూడా శుభ్రపరిచేవారు లేరు. ట్యాంకు వద్దనే పశువుల పాక ఉండడంతో గ్రామస్థులకు కలుషిత నీరే దిక్కవుతోంది. సలకంచెరువు నుంచి చిలేపల్లి వరకు తారురోడ్డు ఉన్నా.. ఎర్రబస్సు మాత్రంరాదు. గ్రామ చరిత్రలో 1995-96లో ఒక ఎర్ర బస్సు వారం మాత్రం నడిచిందని ఊరి జనం చెబుతున్నారు. ఇప్పటి వరకు ఆర్టీసీ బస్సు వచ్చిన సందర్భమే లేదని వాపోతున్నారు. ప్రస్తుతం పాఠశాలలో 11 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు.. ఉన్న పిల్లలను ప్రైవేటు స్కూలుకు పంపుతున్నారు. పదేళ్ల క్రితం విద్యార్థులు లేరని 8 సంవత్సరాలపాటు పాఠశాల మూసేశారు. పెద్దజలాలపురం నుంచి కూతలేరు వంకపై బ్రిడ్జి నిర్మిస్తే చిలేపల్లికి రాకపోకలు మెరుగు పడతాయని గ్రామస్థులు చెబుతున్నారు.

కుగ్రామం.. 100 ఇళ్లు.. 500 జనాభా.. !
ఊరికి సరైన రోడ్డు లేదు.. గ్రామంలో ఎటుచూసినా.. అపరి శుభ్రతే..రోడ్లపైనే మురుగు నిల్వ.. పశువుల పాక పక్కనే తాగునీటి ట్యాంకు.. శుభ్రంచేయక ఐదేళ్లు.. ఊరి చరిత్రలో వారం రోజులే బస్సు సౌకర్యం..ఎన్నికల వేళ మాత్రమే వచ్చే నేతలు హామీ లు గుప్పిస్తారు.. ఆ తర్వాత కన్నెత్తి చూడరు.. ఇదీ.. శింగనమల మండలంలోని చిలేపల్లి వ్యథ..

ఎర్రబస్సు... వారమే వచ్చింది



నాకు 70ఏళ్లు. ఇన్నేళ్లలో 1996-1997 సంవత్సరంలో వారం రోజులు మాత్రమే ఆర్టీసీ బస్సు గ్రామానికి వచ్చింది. తరువాత ఎర్రబస్సు జాడలేదు. ఎన్నికల సమయంలో నాయకులు.. గ్రామానికి బస్సు సర్వీసు నడుపుతామని చెబుతారు తప్ప.. ఇంత వరకు వేయలేదు. దూర ప్రయాణాలు చేయాలంటే కష్టంగా ఉంది.

సాంబయ్య, గ్రామస్థుడు

ఐదేళ్లుగా నీటి ట్యాంకు కడగలేదు



గ్రామానికి తాగు నీరు ట్యాంకు ద్వారా సరాఫరా చేస్తారు. ఐదేళ్లలో ఏనాడూ ట్యాంకును శుభ్రం చేసిన దాఖలాలు లే వు. అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు. కలుషిత నీరు తాగి, ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

రామసుబ్బయ్య, గ్రామస్థుడు

వంకపై బ్రిడ్జి నిర్మించాలి



సలకంచెరువు నుంచి చిలేపల్లికి తారు రోడ్డు ఉంది. అనంతపురం, తాడిపత్రికి వెళ్లాలంటే చాలా దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. పెద్దజలాలపురం వద్దనున్న కూతలేరు వంకపై బ్రిడ్జి నిర్మించి, అక్కడి నుంచి చిలేపల్లి వరకు తారు రోడ్డు వేస్తే దూరం తగ్గుతుంది. గతంలో ఎన్నికల సమయంలో నాయకులు హామీ ఇచ్చారు. ఇంత వరకు పనులు చేసిందిలేదు. ఇప్పటికైనా బ్రిడ్జి పనులు చేపట్టాలి.

లక్ష్మీనారాయణ, గ్రామస్థుడు

బస్సులు ఢీ... డ్రైవర్‌కు గాయాలు

రాప్తాడు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జాతీయరహదారిలో వెళుతున్న ఆర్టీసీ బస్సును వెనుక వైపు ప్రైవేటు బస్సు ఢీకొంది. ఆర్టీసీ బస్సు అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న ఓ రేకుల షెడ్డులోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఆర్టీసీ బస్సు డ్రైవర్ స్వల్ప గాయాలపాలయ్యాడు. రాప్తాడు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు డిపోకు చెందిన ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు బెంగళూరు నుంచి హైదరాబాద్ వెళుతుండగా శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో రాప్తాడు సమీపంలో ప్రసన్నాయపల్లి క్రాస్ సమీపంలో జాతీయరహదారిలో స్పీడ్ బ్రేకర్ల వద్దకు రాగానే ఆర్టీసీ బస్సు నెమ్మదిగా వెలుతుండగా వెనుక వైపు వస్తున్న ప్రైవేటు బస్సు ఆర్టీసీ బస్సు వెనెక వైపు ఢీకొట్టింది. దీంతో ఆర్టీసీ బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన గల ఇరానీ చాయ్ షెడ్డును ఢీ కొని అనంతరం రేకులషెడ్డులోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో రేకుల షెడ్డులో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులందరూ భయభ్రాంతులకు గురయ్యారు. ప్రమాదం తప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంలో స్వల్పంగా గాయపడిన ఆర్టీసీ బస్సు డ్రైవర్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో ఆర్టీసీ బస్సు ముం దు, వెనుకవైపు దెబ్బతినింది. ప్రైవేటు బస్సు ముందు వైపు దెబ్బతినింది. దెబ్బతి న్న బస్సులను రాప్తా డు పోలీస్ స్టేషన్ వ ద్ద ఉంచారు. ఘటనపై విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.





ప్రమాదంలో దెబ్బతిన్న బస్సులు

ఉపాధ్యాయులు సమష్టిగా ఉద్యమించాలి

గుత్తి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు తమ సమస్యల పరిష్కారం కోసం సమష్టిగా ఉద్యమించాలని మాజీ ఎమ్మెల్సీ కత్తినరసింహ రెడ్డి,ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో శుక్రవారం ఎస్టీయూ జిల్లా శాఖ ప్రథమ కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఇందులో కత్తినరసింహారెడ్డి రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే అర్హులైన ఉపాధ్యాయులకు పదోన్నతులు చేపట్టాలన్నారు. అలాగే పీఆర్సీ కమిటీని నియమించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలని, ఇంకా చెల్లించవలసిన 11వ పీఆర్సీ, డీఏ, సరెండర్ లీవులు, సీపీఎస్ ఉద్యోగుల బకాయిలు ఇవ్వాలని , ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించి పర్యవేక్షణ అధికారి పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం పోరాడేందుకు ఉపాధ్యాయులందరూ కలిసి రావాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, జిల్లా నాయకులు ప్రసాద్, సూరీడు, చంద్రశేఖర్, ఎస్టీయూ జిల్లాఇన్‌చార్జి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

గుత్తిరూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేట గ్రామశివారులోని 44వ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. యాడికి మండలం చందన గ్రామానికి చెందిన నారాయణమ్మ, గుత్తి పట్టణం బెస్త వీధికి చెందిన వెంకటలక్ష్మి రాయలచెరువు నుంచి గుత్తికి ఆటోలో బయలుదేరారు. కొత్తపేట గ్రామశివారులోకి రాగానే ఆటో ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీ కొంది. ప్రమాదంలో నారాయణమ్మ, వెంకటలక్ష్మితో పాటు ఆటోడ్రైవర్ ప్రసాద్‌కి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తర్వాత ప్రసాద్‌ను, నారాయణమ్మను అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కలెక్టర్‌ను కలిసిన ఐఓసీ డిపో సీనియర్ మేనేజర్


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న సీనియర్ మేనేజర్

గుంతకల్లు టౌన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్‌ను గుంతకల్లు మండలం నక్కనదొడ్డి ఐఓసీ న్యూ డిపో సీనియర్ మేనేజర్ హరీష్ కుమార్ రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నక్కనదొడ్డి పంచాయతీలో మహిళలకు ఉపాధి కొరకు కుట్టు శిక్షణ ఇచ్చి ఐఓసీ ద్వారా ఉచితంగా కుట్టుమిషన్లను సైతం పంపిణీ చేయనున్నామని తెలిపారు. మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టినందుకు ఆయన్ను కలెక్టర్ అభినందించారు. అలాగే ఎస్పీ జగదీష్‌ను కూడా ఆయన మార్యదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఐఓసీ లైజనర్ జీఏ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్ హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి):పాలిసెట్ ఎంట్రెన్స్ టెస్ట్ అభ్యర్థులు హాల్‌టికెట్‌లను వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని గుంతకల్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పీఎస్‌వీ రమణారెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 30న ఎంట్రెన్స్ పరీక్ష జరగనుందన్నారు. విద్యార్థులు హాల్ టికెట్‌ను పాలిసెట్ ఏపీ.ఎస్‌బీసీ ఇన్ వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

సమ్మెను విజయవంతం చేయండి

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా మే 20 న జరుగుతున్న సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూసీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో శుక్రవారం ఆయన కార్యకర్తలు, మున్సిపల్ కార్మికులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చారన్నారు. ప్రతిఒక్కరూ విజయవంతం చేయాలని కోరారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి వన్నూరుస్వామి, నాయకులు తిమ్మప్ప, వెంకటేశులు, శివ కుమార్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వడ్డీతో రెన్యువల్ చేయాలి

యాడికి/రాయదుర్గం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వడ్డీ చెల్లింపుతోనే రైతుల పంట రుణాలను రెన్యువల్ చేయాలని రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం మండలకేంద్రంలోని పలు బ్యాంకుల మేనేజర్లను కలిసి వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరాముడుయాదవ్, సీపీఐ మండల కార్యదర్శి జూటూరు రఫీ, సహాయ కార్యదర్శి వడ్డె రాముడు, రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి ఓబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఉన్నారు. అలాగే రాయదుర్గం పట్టణంలోనూ ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బీహెచ్ రాయుడు స్థానిక తహసీల్దార్ నాగరాజుకు, యూనియన్, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకుల మేనేజర్లకు ఈ మేరకు వినతిపత్రాలు అందించారు. సీపీఎం జిల్లా సభ్యుడు బీ. మల్లికార్జున, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఎం.మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.


గుత్తిలో న్యాయవాదుల ర్యాలీ


కళ్యాణదుర్గంలో..


పెద్దవడుగూరు ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఐ నాయకులు


కుందుర్పిలో నిరసన తెలుపుతున్న ముస్లింలు

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

- న్యాయవాదుల డిమాండ్
- పహల్గాంలో జరిగిన దాడులపై నిరసన ర్యాలీ

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో 28 మంది పర్యాటకులపై దాడులు చేసి చంపిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని పలువురు డిమాండ్ చేశారు. ఉగ్ర దాడిని నిరసిస్తూ పలు ప్రాంతాల్లో న్యాయవాదులు, ముస్లింలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తదితరులు శుక్రవారం ర్యాలీలు, మానవహారాలు చేపట్టారు. ఉగ్రవాదుల దిష్టిబొమ్మను సైతం దహనం చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. పర్యాటకులపై ఉగ్రవాదులు దాడులకు పాల్పడటం పిరికిపంద చర్యగా అభివర్ణించారు. భారత దేశంలో మత సామరస్యాన్ని చూసి ఓర్వలేక, దేశ సమైఖ్యతను దెబ్బతీయడానికే దాడులకు పాల్పడ్డారన్నారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తర్వాత దాడుల్లో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని సంతాపం తెలిపారు. ముస్లింలు ప్రార్థనలు చేశారు. పలుచోట్ల కొవ్వొతులతో ర్యాలీలు చేపట్టారు.


బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్‌లో కొవ్వొత్తులతో ర్యాలీ


తాడిపత్రిలో జనసేన నాయకుల నిరసన

ప్రజాసమస్యలను తప్పక పరిష్కరిస్తాం: ఎమ్మెల్యే

పామిడి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలన్నింటినీ తప్పక పరిష్కరిస్తామని, మండల అభివృద్ధికి పాటు పడతామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. పట్టణంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌కు ఆయన హాజరయ్యారు. ముందుగా టీడీపీ నాయకులు, అధికారులతో కలిసి పెహల్గాంలో ఉగ్ర దాడిలో మరణించిన వారికి సంతాపం తెలిపారు. అనంతరం పలు గ్రామాల ప్రజలు వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రాలు ఇవ్వగా.. స్వీకరించి పరిశీలించారు. ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. తర్వాత పలు స్వయం సహాయక సంఘాలకు మంజూరైన రుణాలకు సంబంధించి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్, డాక్టర్ సెల్ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ పత్తిహిమ బిందు, నాయకులు, జనసైనికులు, అధికారులు పాల్గొన్నారు.


మహిళ నుంచి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

అసాంఘిక శక్తుల భరతం పడతా..

అభివృద్ధికి అడ్డుపడుతూ, ప్రభుత్వ ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేసే అసాంఘిక శక్తుల భరతం పడతానని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం హెచ్చరించారు. ప్రజాదర్బార్‌లో పంచాయతీ పారిశుధ్య కార్మికులు, పంచాయతీ అధికారులు తమ విధులకు కొంత మంది ఆటంకం కల్గిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆయనకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే పోలీసులకు పలు సూచనలు చేశారు. అభివృద్ధి పనులకు అడ్డుతగిలే వారిపై, ప్రభుత్వ ఉద్యోగుల విధులపట్ల జోక్యం చేసుకునేవారిపై, పనులు చేసుకుని జీవించే వారిని ఇబ్బందులకు గురి చేసే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గించే వారిని ఉపేక్షించవద్దని తెలిపారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే ఎంతటివారినైనా సహించేది లేదంటూ హెచ్చరించారు.

మలేరియా నివారణకు కృషి చేయండి

- వైద్యాధికారుల సూచన

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్: మలేరియా నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని వైద్యాధికారులు సూచించారు. ప్రపంచ మలేరియా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గుంతకల్లు, ఉరవకొండ, తాడిపత్రి, శింగనమల, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో అన్ని పట్టణాలు, మండలకేంద్రాలతో పాటు గ్రామాల్లోని ప్రభుత్వ వైద్యశాలల వైద్యులు, సిబ్బంది వైద్యాధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ.. మలేరియా నివారణకు ప్రజలు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. దోమలు నివారించడంతోనే మలేరియా, డెంగీ లాంటి విష జ్వరాలు రాకుండా అడ్డుకోవచ్చన్నారు. ఇందుకు ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతను కూడా పాటించాలని సూచించారు. అలాగే వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఆశవర్కర్లు, ఏఎన్ఎంలు, మలేరియా సబ్‌యూనిట్ అధికారులు, హెల్త్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.


యాడికిలో వైద్యసిబ్బంది ర్యాలీ

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తా

- మండల సమావేశంలో అధికారులపై ఎంపీపీ మండిపాటు

బెళుగుప్ప, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని అధికారులపై ఎంపీపీ పెద్దన్న మండిపడ్డారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. తొలుత ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం తెలుపుతూ మౌనం పాటించారు. తర్వాత అధికారులు ప్రగతి నివేదిక వెల్లడించారు. అయితే ఎంపీపీ మధ్యలో కలగజేసుకుని ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని, ఇలా అయితే కలెక్టర్‌కు ఫిర్యా చేస్తానని హెచ్చరించారు. ఉద్యోగం ఇప్పిస్తానని అక్రమాలకు పాల్పడిన ఓ ఉద్యోగిపై విచారణ చేపట్టడానికి రెవెన్యూ అధికారులు వెనుకంజ వేయడం ఎంతవరకు సమంజసమని సభ్యుడు పెద్దతిప్పయ్య ప్రశ్నించారు. అలాగే పలువురు సభ్యులు గ్రామాల్లో సమస్యల్ని సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. టీడీపీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, వైస్ ఎంపీపీ రేఖమ్మ, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఎంఈవో మల్లారెడ్డి ఇతర అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

పుట్లూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మనమల గ్రామానికి చెందిన శీలం రమణప్ప (40) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ వెంకటనరసింహం శుక్రవారం తెలిపారు. రమణప్ప గత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. పలుచోట్ల చూపించినా నయం కాలేదు. ఈ క్రమంలో గురువారం రాత్రి నొప్పి అధికం కావడంతో తాళలేక ఇంటిలో విషద్రావకాన్ని తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య తులశమ్మ ఉన్నారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్టు

పుట్లూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అత్యాచారయత్నం చేయడంతో మూడురోజులక్రితం పోక్సో కేసు నమోదైన విషయం విదితమే. ఈ మేరకు ప్రసాద్ అనే నిందితున్ని శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.

30న వైద్యశిబిరం

యల్లనూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 30వ తేదీన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు టీడీపీ మండల నాయకుడు హనుమంతు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. కర్నూలుకు చెందిన శ్రీ చక్ర హాస్పిటల్ వైదయులు వచ్చి కంటి, గుండె పరీక్షలు నిర్వహిస్తారన్నారు. వైద్యశిబిరానికి వచ్చేవారు ఆధార్‌కార్డుతో పాటు హెల్త్‌కార్డు తీసుకురావాలని కోరారు.

గ్రాండ్ టెస్టులు పెట్టి ప్రోత్సహించండి

రాయదుర్గం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల కావడంతో తమకు గ్రాండ్ టెస్టులను నిర్వహించి ప్రోత్సహించాలని డీఎస్సీ అభ్యర్థులు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులును కోరారు. పట్టణంలోని నివాసంలో శుక్రవారం వారు ఆయన్ను కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించారు. 110 రోజుల పాటు తమకు కోచింగ్‌ను అందించి మెటీరియల్‌ను కూడా ఇచ్చి ప్రోత్సాహం అందించిన విషయాన్ని మరువలేమన్నారు. ప్రస్తుతం డీఎస్సీ పరీక్షలకు గడువు సమీపిస్తుండడంతో చదువుకోవడానికి అనుకూలమైన వాతావరణం ఉండేలా స్టడీ హాల్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే గ్రాండ్‌టెస్టులను నిర్వహించి మరింత ప్రోత్సాహాన్ని అందించాలని కోరారు.

గజవాహనంపై శ్రీవారి దర్శనం


గజవాహనంపై ఊరేగుతున్న స్వామివారు

బొమ్మనహాళ్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గల శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం గజవాహన సేవను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఉదయమే స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లకు ప్రత్యేక అలంకరణలు, పూజలు జరిపారు. అనంతరం రాత్రి 8 గంటలకు ఉత్సవమూర్తులను గజవాహనంలో కొలువుదీర్చి గ్రామపురవీధుల్లో ఊరేగించారు. వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలందించండి: డీఎంహెచ్‌ఓ

యాడికి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): చికిత్స కోసం ప్రభుత్వ వైద్యశాలలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎం హెచ్‌ఓ ఈబీదేవి సిబ్బందికి సూచించారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలను శుక్రవారం ఆమె తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ఈ వైద్యశాలలో వైద్యుల కొరత ఉన్న మాట వాస్తవమేనని, త్వరలోనే నియామకం జరుగుతుందని తెలిపారు. యాడికి, రాయలచెరువులో నిలిచిపోయిన ఆస్పత్రి భవనాల నిర్మాణంపై ఆమెను వివరణ కోరగా ఫైనాన్షియల్‌కు సంబంధించిన అంశంతో నిర్మాణాలు ఆగిపోయాయన్నారు. ప్రభుత్వం వాటిని చూసుకుంటుందని అన్నారు. అనంతరం ఆరోగ్య సిబ్బందితో ఆమె మాట్లాడుతూ చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని తెలిపారు. ఆస్పత్రిలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఆమె వెంట డిప్యూటి డెమో త్యాగరాజు, ప్రభుత్వ వైద్యశాల వైద్యుడు పరమేశ్వర్ పాల్గొన్నారు.

మామిడిలో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు

కుందుర్పి/ బ్రహ్మసముద్రం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మామిడి సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ రామయ్య సూచించారు. కుందుర్పి మండలం అపిలేపల్లి గ్రామ సమీపంలో గల వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం ఆయన రైతులకు మామిడి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మండల ఉద్యానవన శాఖ అధికారి గౌసియా తదితరులు పాల్గొన్నారు. అలాగే బ్రహ్మసముద్రం మండలంలోని తీటకల్లు గ్రామంలోనూ, రాజపేట వ్యవసాయ క్షేత్రంలోనూ ప్రొఫెసర్ రామయ్య పర్యటించి మామిడిలో తామర పురుగును నివారించడానికి తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. ఉద్యానవన శాఖాధికారి కృష్ణ తేజ, ఆర్ఎస్‌కే అధికారులు, మామిడి రైతులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు


రోడ్డుపై ఆందోళన చేస్తున్న కాలనీవాసులు

గుత్తి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): తమ కాలనీలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొందని, సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని తాడిపత్రి రోడ్డుపై మారుతీనగర్ కాలనీవాసులు శుక్రవారం ఖాళీ బిందెలతో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రెండు నెలలుగా తమ కాలనీకి తాగునీటి సరఫరా కావడం లేదన్నారు. సమస్యను పలుమార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందన్నారు. తాగునీటి సరఫరా కాకపోతే ఏలా బతకాలంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుపై ఆందోళన చేయడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మున్సిపల్ డీఈఈ హేమచంద్ర నచ్చజెప్పేందుకుప్రయత్నం చేశారు. మహిళలు ఆయనతో వాగ్వాదానికి దిగారు. తమ సమస్య పరిష్కరించేవరకు వెళ్లమన్నారు. త్వరలోనే కొళాయిల ద్వారా నీటిని సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

టీడీపీ మద్దతు మాజీ సర్పంచ్ మృతి

కళ్యాణదుర్గం రూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని హ లికల్లు పంచాయతీ టీడీపీ మద్దతు మాజీ సర్పంచ్ మల్లికార్జునపల్లికి చెందిన పెద్దింటి బొజ్జన్న (74) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బొజ్జన్న 2001 నుంచి 2006 వరకు సర్పంచ్‌గా పని చేశారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కళ్యాణదుర్గం రూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కంబదూరు మండలం నూతిమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. ఆ పాఠశాలలో 1989-90వ విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు మళ్లీ ఇన్నేళ్లకు ఒకచోట కలిశారు. దీంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తర్వాత అప్పటి గురువులు గోపీనాథ్, పార్వతమ్మ, బసన్న, నరసింహా రెడ్డి, ఆంజనేయులును పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.


గురువులతో పూర్వ విద్యార్థులు

బీటీపీకి పూర్వ వైభవం తెస్తాం: కాలవ


బీటీపీ కింద సాగైన పంట పొలాలను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తదితరులు

గుమ్మఘట్ట, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): భైరవానితిప్ప ప్రాజెక్టు(బీటీపీ)కు పూర్వవైభవం తీసుకొస్తామని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. బీటీపీ కింద ప్రస్తుత సీజన్‌లో సాగైన వరి పంట పొలాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. దిగుబడిపై రైతులతో ముచ్చటించారు. ఎకరాకు 45 నుంచి 50 బస్తాల ధాన్యం రావచ్చని రైతులు వివరించారు. 1960-70 ప్రాంతంలో ఏటా బీటీపీ కింద దాదాపు 16 వేల ఎకరాలకుపైగా సాగయ్యేదన్నారు. ఆ తరువాత వర్షాభావ పరిస్థితులు, ఇతరత్రా కారణాలతో ప్రాజెక్టులో నీటి లభ్యత తగ్గుతూ వచ్చిందన్నారు. బీటీపీ పరివాహక ప్రాంతం నుంచి నీటి లభ్యత తగ్గిపోతున్న విషయాన్ని 2014-19 మధ్య సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామన్నారు. హంద్రీనీవా నుంచి కృష్ణాజలాల తరలింపు ద్వారా సమస్యను పరిష్కరించాలని కోరామన్నారు. స్పందించిన ఆయన జీడిపల్లి నుంచి కృష్ణాజలాల తరలింపునకు ఆమోదముద్ర వేశారన్నారు. 2018లో రూ.968 కోట్ల వ్యయంతో బడ్జెట్ ఆమోదింప జేసుకుని పనులు ప్రారంభించామన్నారు. టీడీపీ పాలనలోనే 25 నుంచి 30 శాతం వరకు పనులు పూర్తి చేయగా ఆ తరువాత అధికారంలోకి వచ్చిన జగన్ ఐదేళ్లలో తట్టెడు మట్టి కూడా ఎత్తకుండా కాలయాపన చేశాడని వి మర్శించారు. తాజాగా చంద్రబాబు నాయకత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం కొలువుదీరడంతో మళ్లీ పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కళ్యాణదుర్గం నియోజకవర్గ పరిధిలో 114 చెరువులకు, రాయదుర్గం నియోజకవర్గంలో బీటీపీకి నీరందించే ఈ ప్రాజెక్టుపై సీఎం సానుకూలంగా ఉన్నారన్నారు. బీటీపీ ఛైర్మన్ కాలవ నాగరాజు, రంగచేడు టీసీ మెంబర్ రామప్ప, క్లస్టర్ ఇన్‌చార్జ్ కాలవ సన్నన్న, నాయకులు పాల్గొన్నారు.